# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక




తీన్మార్ మెల్కోల్పు
చట్టం & న్యాయం లపై.....
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మెల్కోల్పు కార్యక్రమంలో
భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com



హైదరాబాద్ | సంపుటి: 04 | సంచిక: 251 | పేజీలు : 8 | మంగళవారం 17 మార్చి 2026 | వెల : 6-00




# హైదరాబాద్‌కు యూకే విద్య



- కేజీ టూ ప్లస్ 2 కరికులంలో సరికొత్త విప్లవం
- ప్రపంచ స్థాయి విద్యా సంస్థల పెట్టుబడులకు క్యూ
- 13 అంతర్జాతీయ పాఠశాలల గ్రీన్ సిగ్నల్

**తెలంగాణ బ్యూరో, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

దేశంలోనే అత్యద్భుతమైన వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్ కల్గిన హైదరాబాదు మహానగరానికే అంతర్జాతీయ సంస్థలు జై కొడుతున్నాయి. ఇదివరకు ఐటీ కంపెనీలు, బయో సంబంధిత సంస్థలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు ఆసక్తి చూపుతుండగా తాజాగా విద్యా సంస్థలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)కు చెందిన 13 ప్రఖ్యాత - మిగతా3లో



# వణికిస్తున్న వడగండ్ల వాన

- 17 జిల్లాలకు ఎల్లో అలర్ట్
- మరో 4 రోజులు గండమే
- అకస్మాత్తుగా మారిన వాతావరణం

**తెలంగాణ బ్యూరో, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ వ్యాప్తంగ పలు జిల్లాల్లో వర్షం కురుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన పడుతోంది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉరుములు మెరుపులతో వడగండ్ల వర్షం పడుతోంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన రాళ్ల వర్షం - మిగతా2లో

# ప్రగతి తెలంగాణే లక్ష్యం

- ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా గుర్తింపు తెచ్చేందుకు సర్కారు కృషి
- అందుకే తెలంగాణ రైజింగ్--2047 విజన్ డాక్యుమెంట్‌కు శ్రీకారం
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చర్యలు
- అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ముందడుగు
- ప్రజా భాగస్వామ్యంతో భవిష్యత్ తెలంగాణ నిర్మాణం
- క్యూర్, ప్యూర్, రేర్‌తో వికేంద్రీకృత వ్యూహం అమలు
- ప్రభుత్వ స్వప్నం సాకారానికి అందరం కలిసి పని చేద్దామని గవర్నర్ పిలుపు... అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ప్రభుత్వాన్ని ఎవరూ ఆపలేరని వ్యాఖ్య



**హైదరాబాద్, తీన్మార్ న్యూస్**

'దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ దిశగా బలమైన పునాదులు వేసేందుకు ఎన్నో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. ఇదే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్--2047 విజన్‌కు శ్రీకారం చుట్టింది. దేశ పురోగతిలో ప్రధాన భూమిక పోషించే స్థాయికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పెరిగేలా చర్యలు చేపట్టింది..'అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా చెప్పారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను - మిగతా2లో

# షూట్ చేయండి.. నేను చూసుకుంటా

రిమాండ్ రిపోర్టులో విస్తుపోయే నిజాలు.. మొయినాబాద్ ఫామ్‌హౌస్ కేసులో సంచలనం

పోలీసుల ముందే రివాల్వర్‌తో గర్జన.. భయపెట్టేందుకు మూడు రౌండ్ల కాల్పులు

జర్మన్ మేడ్ రివాల్వర్, కొకైన్ స్వాధీనం.. డ్రగ్ టెస్టుల్లో ఆరుగురికి పాజిటివ్



2

# రైతులకు ప్రాణసంకటంగా "గడ్డి మందు"

తక్షణమే నిషేధించాలి

70 దేశాల్లో బ్యాన్.. మన దగ్గర విచ్చలవిడి విక్రయాలు

సీఎం రేవంత్‌కు రైతు కమిషన్ నివేదిక



**హైదరాబాద్, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

రాష్ట్రంలో విచ్చలవిడిగా లభిస్తున్న గడ్డి మందులను తక్షణమే నిషేధించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ బృందం అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి తోపాటు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కలిసి నివేదికను - మిగతా3లో

# అధికారం పోతే.. అందరికీ పోతుంది

- నన్ను అనలేదు కదా అని ఊరికే ఉంటే అందరం నష్టపోతాం
- ప్రతిపక్షాలను సమర్థంగా తిప్పికొట్టాలి.. చర్చల్లో చురుకుగా పాల్గొనాలి
- సభలో కూర్చోకపోతే ఎమ్మెల్యే అవడం ఎందుకు?
- సీఎల్పీ సమావేశానికి రానంత బిజీగా ఎమ్మెల్యేలున్నారా?
- ఎమ్మెల్యేలు కలిసేందుకు మంత్రులు టైం ఇవ్వాలి... నేనూ ఇస్తా
- సీఎల్పీ సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ క్లాస్



**హైదరాబాద్, తీన్మార్ న్యూస్**

'అధికారంలో ఉంటేనే అందరికీ గౌరవం ఉంటుంది. అధికారం పోతే ఏ ఒక్కరిదో పోదు. అందరికీ పోతుంది. నన్ను అనలేదు కదా అని ఏమీ మాట్లాడకుండా ఉంటే అందరం నష్టపోతాం. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదు. వ్యవస్థ మొత్తం డ్యామేజీ అవుతుంది. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుంది. పార్టీ, ప్రభుత్వ లైన్‌లోనే అందరూ స్పందించాలి. ఇప్పుడు మనం వేసుకునే రోడ్‌మ్యాపే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుంది'అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రెండేళ్లపాటు గత ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు చెప్పుకున్నామని, ఇప్పుడు ఆ టైం అయిపోయిందని, ప్రజలకు సమాధానం చెప్పుకునే సమయం వచ్చిందని, చేసింది చెప్పుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని స్పష్టం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సోమవారం మధ్యాహ్నం శాసనమండలి సమావేశ మందిరంలో కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశంలో ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ, ప్రభుత్వ పరంగా సమష్టిగా ముందుకెళ్లాల్సిన తీరును వారికి - మిగతా2లో

# రూ. 3.2 లక్షల కోట్లతో ప్రజా బడ్జెట్

- మార్చి 20న రాష్ట్ర బడ్జెట్
- 30 వరకు సమావేశాలు
- ఆరు గ్యారంటీలు, రైతు భరోసాపై చర్చకు రంగం సిద్ధం
- ప్రజా సమస్యలే అజెండా
- కీలక బిల్లుల ప్రవేశానికి ప్రభుత్వం కసరత్తు



**హైదరాబాద్, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ సమావేశాలను మార్చి 16 నుండి మార్చి 30వ తేదీ వరకు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ మరియు ముఖ్యమంత్రి సమాధానం ఉంటుంది. మార్చి 19న ఉగాది పండుగ - మిగతా3లో

# ప్రగతి తెలంగాణే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

పురస్కరించుకుని సోమ వారం ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను స్మరిస్తూ, వారిని గౌరవిస్తూ ప్రభుత్వం ప్ర జా పాలన స్ఫూర్తిని కొనసాగిస్తోంది. అమలు చేసే ప్రతి పథకం, ప్రతి విధానం, ప్రతి కార్యాచరణలో ప్రజల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక సమానత్వాన్ని ప్రభుత్వం పాటిస్తుందని విశ్వసిస్తున్నా. అదే ప్రజా పాలనకు గీటురాయి. రాష్ట్ర అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ కేంద్రంగా జరగాలనే పాత మోడల్‌కు ప్రజా ప్రభుత్వం ముగింపు పలికింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా, సమతుల్యంగా, సమ్మిళితంగా అభివృద్ధి చేసేందుకు ముందడుగు వేసింది. క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్, ప్యూర్ (పెరీ అర్బన్ రీజియన్), రేర్ (రూరల్ అగ్రి రీజియన్)తో వికేంద్రీకత వ్యూహాన్ని అనుసరిస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేసి భవిష్యత్తు తెలంగాణను నిర్మిస్తోంది.

**ఆర్థిక వ్యవస్థ సుస్థిర వృద్ధి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'తెలంగాణ రైజింగ్ విజన్--2047'డాక్యుమెంట్‌ను ఆవిష్కరించింది. 'వికసిత్ భారత్-- 2047 విజన్'కు అనుగుణంగా, నీతి ఆయోగ్, ఐఎస్‌బీ, నల్సార్ వర్సిటీని సంప్రదించి దీన్ని రూపొందించింది. ప్రస్తుతం తెలంగాణ ఆర్థికంగా సుస్థిర స్థానంలో ఉంది. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సుస్థిర వృద్ధి నమోదు చేస్తోంది. 2025--26లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.17.82 లక్షల కోట్లు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99 శాతం. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరుకుంది. ఇదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని 0.2 శాతానికి ప్రభుత్వం నియంత్రించింది. ధరల స్థిరత్వం కొనసాగించింది.

**ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చర్యలు**

గత రెండేళ్లుల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎన్నో చర్యలు చేపట్టింది. రాష్ట్రం వేగంగా పట్టణీకరణ చెందుతోంది. 2031 నాటికి రాష్ట్రంలో పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనా. పట్టణాల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. ఇది నగర పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తుంది. మహా నగరంలో పరిపాలనా సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు హైదరాబాద్ పోలీసు అధికార పరిధిని విస్తరించింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, కొత్తగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించింది.

**నీటి వనరుల పునరుద్ధరణకు హైడ్రా**

క్యూర్ పరిధిలోని ప్రాంతాన్ని పారిశ్రామిక కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని నిర్ణయించింది. దీంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. క్యూర్ ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించింది. క్యూర్ పరిధిలోని నీటి వనరులను పునరుద్ధరించేందుకు హైడ్రాను ఏర్పాటు చేసి దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా ఆక్రమణకు, కబ్జాలకు గురైన చెరువు భూములు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంది. ఫలితంగా బతుకమ్మ కుంట, నల్ల చెరువు, బమ్ రుక్ ఉద్‌దౌలా చెరువులు పూర్వ వైభవం సంతరించుకున్నాయి. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య ఉన్న ప్యూర్ ప్రాంతాన్ని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. తెలంగాణ పశ్?చమ ప్రాంతంలో ఉన్న కొడంగల్ ఏరియా ఇండస్ట్రియల్ హబ్ గా మారనుంది. జహీరాబాద్‌లో 3,245 ఎకరాల్లో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ స్మార్ట్ సిటీ అభివృద్ధి జరుగుతోంది.

**మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు**

హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు ఫేజ్--1 ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభమవుతుంది. గోదావరి నీటిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు అనుసంధానించడం ద్వారా 2.5 టీఎంసీల నీటిని మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అందిస్తారు. దీంతో క్యూర్ ప్రాంతానికి రోజుకి 300 మిలియన్ గ్యాలన్ల తాగునీరు అందుతుంది. హైదరాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ, అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైదరాబాద్--అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల కేంద్రం హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణెలకు మూడు హైస్పీడ్ బుల్లెట్ రైళ్లను ప్రకటించింది. ఈ నేపథ్యంలో శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. 56 గ్రామాలు, ఏడు మండలాలతో 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైంది. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఏర్పాటు కానుంది.

**భారీగా పెట్టుబడుల ఆకర్షణ**

తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మార్చేలా ఆవిష్కరణలకు, పెట్టుబడుల సాధనకు, సుస్థిర అభివద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇటీవల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించింది. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక రంగంలోని ప్రముఖులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. ఇటీవలి 23వ బయో ఏషియా సదస్సులో దాదాపు రూ.1,700 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది.

**సాగునీటికి, రైతు సంక్షేమానికి ప్రాధాన్యత**

రాష్ట్రంలో సాగునీటి రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస ప్రక్రియను కొన్ని నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వ్యవసాయ ఉత్పాదకత పెంచేందుకు అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించటంతో పాటు రైతు సంక్షేమ పథకాలు అమలు చేసింది.

రైతు భరోసా పెట్టుబడి సహాయ పథకం కింద ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ.8,744 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. రూ.2 లక్షల లోపు రైతుల పంట రుణాలను మాఫీ చేసింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 236.87 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుంది.

**3.38 కోట్ల మందికి ఆహార భద్రత**

రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి ఆహార భద్రతను కల్పిస్తోంది. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. 42.90 లక్షల కుటుంబాలకు రూ.500కే ఎల్పీజీ సిలిండర్లను అందిస్తోంది. 53.09 లక్షల కుటుంబాలు గృహజ్యోతి ఉచిత కరెంటు సరఫరాతో ప్రయోజనం పొందుతున్నాయి. విద్యార్థులకు డైట్ చార్జీలు 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 212 శాతం పెంచింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. డ్రగ్స్ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)ను ఏర్పాటు చేసింది.

**రూ.3.13 లక్షల కోట్లకు ఐటీ ఎగుమతులు**

తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దాదాపు 9.39 లక్షల మంది యువతీ యువకులు ఐటీ ఉద్యోగాల్లో ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత ప్రోత్సహించడానికి, రూ.15 వేల కోట్లతో ప్రజా ప్రభుత్వం తెలంగాణ టూరిజం పాలసీ 2025--2030 ప్రకటించింది. దీంతో దాదాపు 3 లక్షల ఉద్యోగాలు రానున్నాయి.

**చారిత్రక మార్పు దశలో రాష్ట్రం**

రాష్ట్రం ఒక చారిత్రక మార్పు దశలో నిలబడింది. ఈ బడ్జెట్ కేవలం ఆర్థిక కేటాయింపులకే పరిమితం కాదు. ఇది అంతర్జాతీయ ప్రమాణాలతో, అధునాతనమైన భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి మార్గదర్శనం. రాష్ట్రంలోని ప్రతి పౌరుడి ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలను తీర్చేందుకు, తెలంగాణ సమగ్ర అభివద్ధికి ఉపయోగపడే రోడ్ మ్యాప్. రాష్ట్ర సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధిపై ప్రభుత్వం చాలా స్పష్టతతో ఉంది. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ప్రభుత్వాన్ని ఎవరూ ఆపలేరు. అభివృద్ధి చెందిన దేశాలు, నగరాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ చేరుకుంటుంది. ప్రజా ప్రభుత్వ స్వప్నాన్ని సాకారం చేయడానికి ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో నిలువెత్తు నిబద్ధతతో మనమందరం కలిసి పని చేద్దాం. తెలంగాణను ప్రపంచంలోనే అగ్రభాగాన నిలుపుదాం.

# షూట్ చేయండి.. నేను చూసుకుంటా



తెలంగాణ బ్యూరో, మార్చి 16 (తీన్మార్ న్యూస్):

మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ కేసులో పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి.స్విమ్మింగ్ పూల్ వద్ద మద్యం పార్టీతో పాటు డ్రగ్స్ వినియోగం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో కాల్పులు జరగడం కూడా పరిస్థితిని మరింత తీవ్రంగా మార్చింది. పోలీసులు ఫామ్‌హౌస్‌లోకి ప్రవేశించిన సమయంలో ముందుగా బుల్లెట్ శబ్దం వినిపించిందని రిమాండ్ రిపోర్టులో తెలిపారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై తాము పోలీసులము.. కాల్పులు చేయవద్దు అని గట్టిగా హెచ్చరించారు. అయితే ఆ హెచ్చరికల తర్వాత కూడా మరో రెండు సార్లు కాల్పుల శబ్దం వినిపించిందని రిమాండ్ రిపోర్టులో తెలిపారు. ఆ సమయంలో మీరు కాల్చేయండి.. ఏం జరిగినా బాధ్యత నాదే అని ఒకరు గట్టిగా చెప్పినట్టు పోలీసులు వివరించారు. పోలీసులు గట్టిగా అరిచిన వెంటనే కాల్పులు ఆగిపోయినట్లు వెల్లడించారు. పోలీసులు ఫామ్‌హౌస్‌లో సెర్చ్ వారెంట్‌తో తనిఖీలు నిర్వహించారు. బాత్రూం దగ్గర ఉన్న నమిత్ శర్మ చేతిలో తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. బుల్లెట్ షెల్స్ పట్టుకుని ఉన్న మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ఒక మహిళతో పాటు మొత్తం 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. జర్మన్ తయారీ పాయింట్ 0.32 రివాల్వర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొదట విచారణలో ఎవరూ డ్రగ్స్ తీసుకోలేదని చెప్పినా, పదేపదే ప్రశ్నించడంతో సిల్వర్ శరత్ కుమార్ డ్రగ్స్ తీసుకున్నట్టు ఒప్పుకున్నాడు. అతని వద్ద రెండు గ్రాముల కొకైన్ కూడా లభించింది. కొకైన్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయాన్ని మొదట ఎవరూ వెల్లడించలేదు. తరువాత పైలట్ రోహిత్ రెడ్డి డ్రైవర్‌ను విచారించగా అసలు విషయం బయటపడింది. విచారణలో కౌశిక్ రవి కొకైన్ తానే తెచ్చినట్లు ఒప్పుకున్నాడు. సిమ్లాకు బిజినెస్ ట్రిప్‌కు వెళ్లినప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఈ డ్రగ్స్ కొనుగోలు చేశానని తెలిపాడు. డ్రగ్స్ పార్టీ కోసం కొకైన్ తీసుకొచ్చినట్లు చెప్పాడు. ఒక్క గ్రాము కొకైన్‌ను సుమారు 15 వేల రూపాయలకు కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. పార్టీలో ఉన్న 11 మందికి డ్రగ్ టెస్టులు నిర్వహించగా పలువురికి పాజిటివ్ వచ్చింది. నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, పుత్త మహేష్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవికి డ్రగ్ పాజిటివ్ వచ్చినట్లు రిపోర్టులు వెల్లడించాయి. ఎర్రగడ్డ ఆసుపత్రిలో రెండోసారి నిర్వహించిన రక్త పరీక్షల్లో కూడా ఇదే విషయం బయటపడింది. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్టు పరీక్షల్లో తేలింది. పోలీసులు ఫామ్‌హౌస్‌లోకి రావడంతో భయపడిపోయి వారిని భయభ్రాంతులకు గురిచేయడానికి కాల్పులు జరిపినట్లు నమిత్ శర్మ తెలిపినట్లు రిపోర్టులో పేర్కొన్నారు. కాల్పుల అనంతరం అక్కడి నుంచి పారిపోవాలని కూడా ప్లాన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. విచారణలో భాగంగా పైలట్ రోహిత్ రెడ్డి ముందుగానే వీకెండ్ డ్రగ్ పార్టీ ఏర్పాటు చేసినట్లు సమాచారం ఇచ్చినట్లు తేలింది. అతని ఆహ్వానం మేరకు పలువురు ఫామ్‌హౌస్‌కు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతుండగా, డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌పై కూడా పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు.

## అధికారం పోతే.. అందరికీ పోతుంది

-మొదటిపేజీ తరువాయి



వివరిస్తూనే వ్యక్తిగత వ్యవహారశైలిపైనా ఆయన క్లాస్ తీసుకున్నారు.

**జీవిత లక్ష్యం వృధా చేసుకోవద్దు**

పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తీరు గురించి రేవంత్ తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. 'జీవిత లక్ష్యంగా పెట్టుకుని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా మీరు చట్టసభలకు వచ్చారు. కానీ ఆ పదవికి న్యాయం చేయనప్పుడు ఎందుకు? నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీనియర్లు ఉండేవారు. నాకు మాట్లాడటానికి మైక్ ఇచ్చేవారు కాదు. అయినా కొట్లాడి మాట్లాడాలని ప్రయత్నించేవాడిని. కానీ ఇప్పుడు ఎమ్మెల్యేలు సభకు కూడా రావడం లేదు. వచ్?చినా సంతకం పెట్టి వెళ్లిపోతున్నారు.

సభలో కూర్చోకపోతే ఎమ్మెల్యే ఎందుకు కావాలి? కొందరు సీఎల్పీ సమావేశానికి కూడా రాలేదు. సీఎల్పీ సమావేశానికి రాలేనంత బిజీగా ఉన్నారా? కష్టపడి సాధించుకున్న ఎమ్మెల్యే పదవికి అన్యాయం చేయొద్దు. సభకు రాకపోయినా, ఏం చేసినా ఏం కాదులే అనుకోవద్దు. ఇప్పటికిప్పుడే ఏమీ కాకపోవచ్చు. కానీ భవిష్యత్తులో అన్నింటిని పరిగణనలోకి తీసుకుంటారు. బీఫారం ఇచ్చేటప్పుడు అన్ని లెక్కలూ చూస్తారు'అని చెప్పారు.

**సమర్థవంతంగా తిప్పికొట్టాలి**

అసెంబ్లీ, మండలిలో జరిగే చర్చల్లో చురుకుగా పాల్గొనాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించా రు. బాగా చదువుకున్న మహిళా ఎమ్మెల్యేలున్నారని, వారంతా సభకు హాజరు కావడమే కాకుండా చర్చల్లో పాలుపంచుకోవాలని కోరారు. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాల వాదనలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వంలో మూడో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని, ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలను గవర్నర్ ప్రసంగంలో వివరించారని సీఎం చెప్పారు. ఈ ప్రసంగం ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిది. మన భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారించాలి. మూడో బడ్జెట్‌తోపాటు మిగిలిన సంవత్సరాల బడ్జెట్ ప్రతిపాదనలు కూడా ప్రజారంజకంగా ఉండబోతున్నాయి. ఈ విషయాలను అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరించాలి. సభలో మాట్లాడే అంశాలపై విప్‌ల మధ్య సమన్వయం ఉండాలి. అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలు పర్యటించి సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాల ను అధ్యయనం చేయాలి. అవసరమైతే చైనా లాంటి అభివృద్ధి చెందిన దేశాలకూ వెళ్లి రావాలి'అని దిశానిర్దేశం చేశారు.

**మంత్రులు సమయం ఇవ్వాలి**

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె.మదన్‌మోహన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలుగా తాము మంత్రులు, అధికారులకు ఇచ్?చన వినతులకు సరిగా స్పందన ఉండడం లేదని వాపోయారు. ఎమ్మెల్యేలకు మంత్రులతోపాటు సీఎం టైం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ మంత్రులు తమను కలిసేందుకు ఎమ్మెల్యేలకు సమయం ఇవ్వా లని సూచించారు. తాను కూడా ఇస్తానని చెప్పారు. ఏదో ఒక సమయం ఇందుకోసం ఫిక్స్ చేసుకోవాలని, ఎమ్మెల్యేలిచ్చే వినతిపత్రాలను వీలైనంత త్వరగా పరిష్కరించే దిశలో చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, తన దగ్గరకు వచ్?చ న ఎమ్మెల్యేలే మళ్లీ వచ్చి కలుస్తున్నారని, అలా కలవడం ఎందుకని ప్రశ్నించారు. ప్యానెల్ స్పీకర్‌గా దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్ బాగా హ్యాండిల్ చేస్తున్నారని కొనియాడారు. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే కావడానికి 30 ఏళ్లు పట్టిందని, అంత కష్టపడితే లభించిన పదవికి అడ్లూరి లక్ష్మణ్‌తో సహా అందరు ఎమ్మెల్యేలు న్యాయం చేయాలని సూచించారు.

మీడియాతో జాగ్రత్తగా వ్యవహరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రేవంత్ సూచించినట్టు సమాచారం. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు మీడియాతో చిట్‌చాట్‌లు చేయొద్దని, వ్యక్తిగతంగా ఎవరూ మాట్లాడవద్దని చెప్పినట్టు తెలిసింది. విలేకరులు అడిగే ప్రశ్నలు ఎమ్మెల్యేలు, మంత్రులపై ప్రేమతో కాదని, వార్తల కోసం మాత్రమే వారు ప్రశ్నలు అడుగుతారని చెప్పినట్లు సమాచారం.

**అబద్ధాలను తిప్పికొట్టండి: పీసీసీ చీఫ్**

గత రెండేళ్లలో ప్రజలకు ఇచ్?చన హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నం చేశామని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఆరు గ్యారంటీల విషయంలో ప్రతిప క్షాల అబద్ధపు ప్రచారాలను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. కాగా, ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని సీఎల్పీ అభినందించింది.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లపై కార్యాచరణ

హైదరాబాద్



హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లో నివసించే పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రెండు పడకల గదుల ఇళ్లపై శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. "క్యూర్ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురి కావొద్దు. రెండు పడకల గదుల ఇళ్లు పొంది అద్దెకు ఇస్తున్న వారికి, ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచుతున్న వారికి నోటీసులు జారీ చేయాలి. నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలి. లబ్ధిదారుల నుంచి తాము ఇక్కడే నివాసం ఉంటామని, లేకపోతే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని.. వారి నుంచి హామీ పొందాలి. నాలుగు జిల్లాల పరిధిలోని కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి కనీస వసతులను తప్పనిసరిగా కల్పించాలి. ఈ విషయంలో జీహెచ్ఎంసీ సహకారం తీసుకోవాలి. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధప్రతిపాదికన ఏర్పాటు చేయాలి. అసంపూర్తిగా ఉన్న రెండు పడకల గదుల టవర్లను వెంటనే పూర్తిచేయాలి. పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు కేటాయించాలి. కాలనీలో ఉన్న వాణిజ్య సముదాయాలను అద్దె ప్రాతిపదికన కాకుండా వేలం పద్ధతిలో విక్రయించాలి. ఇక్కడ వచ్చిన డబ్బులను సొసైటీ, ప్రభుత్వం పేరిట సంయుక్త ఖాతాలో జమ చేయాలి. ప్రజాప్రయోజనాల కార్యాలయాల కోసం వీటిలో కొంత కేటాయించాలి. ఈ విషయంలో సహకారశాఖ సమన్వయంతో ముందుకు పోవాలి" అని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎండీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై నిప్పుల వాన

**దుబాయ్, కైరో**

ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దళాలు నిప్పుల వాన కురిపించాయి. ఇస్ఫహాన్, షిరాజ్ నగరాలపై భారీగా విరుచుకుపడ్డాయి. ఇస్ఫహాన్‌లో పారిశ్రామిక ప్రాంతంపై దాడులు జరిగాయి. దీంతో 15 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. అటు ఇరాన్.. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. యుద్ధం ముగింపునకు ఇరాన్ విధించిన షరతులు అంగీకారయోగ్యంగా లేవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. మరోవైపు తాము కాల్పుల విరమణను కోరలేదని ఇరాన్ ప్రకటించింది.

ఇస్ఫహాన్ ప్రావిన్సులో ఆదివారం భారీ దాడులు జరిగాయి. 15 మంది మరణించారు.

ఇరాన్ దక్షిణ ప్రాంతంలో ఉన్న షిరాజ్ నగరంపై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు చేశాయి. అక్కడి క్షిపణి కేంద్రంపై విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో పలు నివాసాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు.

లెబనాన్‌లోని దహియే, బీరుట్ శివార్లపై దాడులు జరిగాయి. దీంతో ఆ ప్రాంతాల్లో దట్టమైన పొగ అలముకుంది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా లెబనాన్‌లో 8,31,000 మంది నిరాశ్రయులయ్యారు.

లెబనాన్‌లోని హెజ్‌బొల్లా కమాండ్ కేంద్రాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. రాకెట్ ప్రయోగ కేంద్రాలనూ నాశనం చేశామని వెల్లడించింది.

ఇప్పటిదాకా తమ దేశంలో 153 ఆరోగ్య కేంద్రాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ వెల్లడించింది. కెర్మన్‌షా, ఇస్ఫహాన్‌లో అధికంగా వైద్య వ్యవస్థలు ధ్వంసమయ్యాయని వివరించింది.

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం ధ్వంసమైంది.

**గల్ఫ్ దేశాలపై..**

గల్ఫ్ దేశాలపై ఆదివారం క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి దేశాలు ముందుగానే ప్రజలు బయటకు రావొద్దని సూచించాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) 50వ విడత క్షిపణులను ప్రయోగించింది. పశ్చిమాసియాలోని ఫ్యాక్టరీలను ఖాళీ చేయాలని అమెరికాను హెచ్చరించింది. సమీపంలోని ప్రజలు ఖాళీ చేయాలని సూచించింది.

ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ఉన్న నీ బ్రాక్, రమత్ గన్ ప్రాంతాలపై రాకెట్ దాడులు జరిగాయి. ఒకరు గాయపడ్డారు. టెల్ అవీవ్ సెంట్రల్ సిటీపైకీ రాకెట్లు దూసుకొచ్చాయి. ఈ ఘటనల్లో ఇద్దరు గాయపడ్డారు. ఐలత్‌పై ప్రయోగించిన క్షిపణి క్లస్టర్ బాంబును మోసుకొచ్చింది. దాని శకలాలు పట్టణమంతా పడ్డాయి. ఇజ్రాయెల్‌లో 24 గంటల్లో 108 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్‌లోని లహవ్ 433 ప్రత్యేక పోలీస్ యూనిట్, గిలత్ డిఫెన్స్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ సెంటర్‌పై దాడి చేశాయని ఇరాన్ వెల్లడించింది.

రియాద్ గగనతలంలోకి దూసుకొచ్చిన 4 డ్రోన్లను సౌదీ అరేబియా కూల్చివేసింది. అల్–ఖర్జ్ దిశగా దూసుకొచ్చిన 6 బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకుంది.

ఇజ్రాయెల్‌కు సహకరిస్తున్న 20 మంది పౌరులను ఇరాన్ అరెస్టు చేసింది.

యూఏఈలోని అల్ ధఫ్రా అమెరికా వైమానిక స్థావరంపైకి ఇరాన్ 10 క్షిపణులను, భారీగా డ్రోన్లను ప్రయోగించింది. యుద్ధంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ 19 మంది భారతీయులుసహా 35 మందిని అరెస్టు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

ఇజ్రాయెల్‌లోని సైనిక ప్రాంతాలపై నాలుగు రాకెట్లను ప్రయోగించినట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది.

ఇరాక్‌లో కూలిపోయిన అమెరికా విమానంలో మరణించిన వారి వివరాలు వెల్లడయ్యాయి. వారిలో మేజర్ జాన్ ఎ క్లిన్నర్ (33), కెప్టెన్ అరియానా జి సవినో (31), టెక్ సార్జెంట్ ఆష్లీ బి ప్రూట్ (34), కెప్టెన్ సెథ్ ఆర్ కోవల్ (38), కెప్టెన్ కర్టిస్ జే ఆంగ్స్ (30), టెక్ సార్జెంట్ టైలర్ హెచ్ సిమన్స్ (28) ఉన్నారు.

ఇరాక్ రాజధాని బాగ్దాద్ విమానాశ్రయంవద్ద ఉన్న అమెరికా సైనిక స్థావరంపై వరుస డ్రోన్ దాడులు జరిగాయి. ఐదు డ్రోన్లు రాగా మూడింటిని కూల్చివేశారు.

**పాక్, అఫ్ఘాన్‌లకు వలస**

యుద్ధం నేపథ్యంలో ఇరాన్ ప్రజలు సురక్షితంగా భావిస్తున్న తమ దేశంలోని ఉత్తర ప్రావిన్సులకు వలస వెళ్తున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి అఫ్ఘానిస్థాన్‌కు 32,000 మంది, పాకిస్థాన్‌కు 4,000 మంది వలస వెళ్లారు. ఇరాక్‌తో సరిహద్దులను మూసివేశారు.

అమెరికాకు అనుమతివ్వని స్విట్జర్లాండ్: అమెరికా నిఘా విమానాలకు స్విట్జర్లాండ్ అనుమతి నిరాకరించింది. మానవతా, వైద్య సహాయానికి సంబంధించిన విమానాలకు అనుమతిస్తామని ప్రకటించింది.

**చమురు ఎగుమతులపై చైనా నిషేధం**

యుద్ధం నేపథ్యంలో చమురు ఎగుమతులను చైనా నిషేధించింది. దీంతో ఆస్ట్రేలియా విమాన ప్రయాణికులను ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. చైనా నిర్ణయంతో ఆస్ట్రేలియాలో ఇంధన కొరత తలెత్తింది. ఫలితంగా విమాన ఛార్జీలు ఆకాశాన్నంటాయి.

అత్యవసర నిధులకు ఇజ్రాయెల్ ఆమోదం: యుద్ధం నేపథ్యంలో 827 మిలియన్ డాలర్ల అత్యవసర నిధుల విడుదలకు ఇజ్రాయెల్ ఆమోదం తెలిపింది. ఈ నిధులతో సైన్యం ఆయుధాలను సమకూర్చుకోనుంది.

అమెరికా వెళ్లిపోతేనే శాంతి: పెజెష్కియాన్ పశ్చిమాసియా ప్రాంతం భద్రంగా ఉండాలంటే అమెరికా అక్కడ ఉండకూడదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు.

**గల్ఫ్ దేశాలతో ఉద్రిక్తతల తగ్గింపునకు ప్రయత్నాలు: ఇరాన్**

గల్ఫ్ దేశాలతో ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ప్రయత్నాలు ఎంతవరకు వచ్చాయనేది మాత్రం ఆయన వెల్లడించలేదు. అదే సమయంలో అమెరికావైపు నుంచి కాల్పుల విరమణను తాము కోరలేదని తేల్చి చెప్పారు. చర్చలకు కూడా విజ్ఞప్తి చేయలేదని పేర్కొన్నారు. విదేశీ దురాక్రమణదారులను పంపించివేయాలని ఆయన గల్ఫ్ దేశాలకు పిలుపునిచ్చారు. యుద్ధ నౌకలను పంపాలని మిత్ర దేశాలను ట్రంప్ కోరడం బిచ్చమెత్తుకోవడమేనని వ్యాఖ్యానించారు. తాము కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుంటున్నామని తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని జనావాసాలపై ఎవరు దాడి చేశారో తేల్చడానికి కమిటీ వేసేందుకు సిద్ధమని వెల్లడించారు. కేవలం అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే హర్మూజ్‌ను మూసివేసినట్లు తెలిపారు. ఇతర దేశాల నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని చెప్పారు. అయితే భయంతో అవి రావడం లేదని పేర్కొన్నారు. తమ దేశంలోని యురేనియం మట్టిలో కూరుకుపోయిందని, దానిని వెలికితీసే ప్రణాళికలేవీ లేవని స్పష్టం చేశారు.

హర్మూజ్ జల సంధిని మూసివేయలేదని ఐఆర్‌జీసీ నేవీ కమాండర్ అలీరెజా తంగ్సిరి తెలిపారు.

తమ డ్రోన్లను పోలిన వాటిని తయారుచేసి గల్ఫ్ దేశాలపై ప్రయోగించి తాము బాంబులు వేసినట్లుగా అమెరికా–ఇజ్రాయెల్ చూపుతున్నాయని ఇరాన్ ఆరోపించింది. 136 షాహెద్ డ్రోన్లను పోలిన లూకాస్ డ్రోన్లతో సంబంధం లేని లక్ష్యాలపై దాడులు చేస్తున్నాయని పేర్కొంది.

# రాహుల్ గాంధీ భారత్‌ను, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతదేశాన్ని, దాని ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఇటీవలె దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సు వద్ద కాంగ్రెస్ యువజన విభాగం నేతలు చొక్కాలు లేకుండా నిరసనకు దిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదని హితవు పలికారు. విపక్షాలకు నిరసన తెలిపే హక్కు తప్పకుండా ఉంటుందని, కానీ ఏఐ సదస్సులాంటి చోట నిరసన తెలపడం సరికాదన్నారు. బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీలను వ్యతిరేకించే క్రమంలో, చివరకు భారతదేశాన్ని కూడా వ్యతిరేకించడాన్ని రాహుల్ గాంధీ మొదలుపెట్టారని అమిత్‌షా విమర్శించారు. ఆదివారం అసోంలోని గువహటిలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**రాహుల్ క్షమాపణ చెప్పకపోగా, నిరసనకారులను పొగిడారు**

"భారతదేశాన్ని ఏఐ విభాగంలో బలోపేతం చేసే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సదస్సును దిల్లీలో నిర్వహించాం. కానీ కాంగ్రెస్ నేతలు అక్కడికి వెళ్లిపోయి, అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. వాళ్లలాగే మేం కూడా రాజకీయాల్లో ఉన్నాం. గతంలో ప్రతిపక్షంగా పనిచేసిన అనుభవం సైతం మాకుంది. కానీ ఇలాంటి నిరసన కార్యక్రమాలను మేం నిర్వహించలేదు. ఏఐ సదస్సు అనేది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదు. యావత్ ప్రపంచం భారతదేశ ఏఐ టెక్నాలజీని, ఆవిష్కరణలను చూడటానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆ సదస్సుకు వచ్చింది. దేశానికి ముఖ్యమైన ఆ సదస్సు దగ్గర కాంగ్రెస్ యువజన విభాగం నేతలు అర్ధనగ్నంగా నిరసన తెలిపినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకపోగా, ఆ నిరసనలో పాల్గొన్నవాళ్లను ధైర్యవంతులని పొగిడారు. దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కాంగ్రెస్ ఆ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది.ఏ బాధ్యతాయుత రాజకీయ పార్టీ కూడా అలా వ్యవహరించదని నేను భావిస్తున్నాను" అని అమిత్‌షా పేర్కొన్నారు.



**సత్తా ఉంటే బీజేపీని ఢీకొనండి**

నిజంగా సత్తాయే ఉంటే నేరుగా ప్రజాక్షేత్రంలో బీజేపీని ఢీకొనాలని కాంగ్రెస్ పార్టీకి అమిత్‌షా సవాల్ విసిరారు. ఏఐ సదస్సు లాంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల వద్ద నిరసనలకు దిగుతూ భారతీయ యువతకు అవకాశాలను కాంగ్రెస్ తగ్గిస్తోందన్నారు. అనవసరమైన చోట్ల ప్రతాపాన్ని చూపిస్తున్న రాహుల్ గాంధీ, పార్లమెంటు నుంచి మాత్రం పారిపోతున్నారని కేంద్ర హోంమంత్రి విమర్శించారు. ఇలా చేస్తున్నందుకు భారత ప్రజలు రాహుల్‌ను క్షమించరన్నారు.

**ఆరోగ్య రంగంలో అసోం స్వయం సమృద్ధి**

"అసోంను ఆరోగ్య రంగంలో వికసిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం హిమంత బిస్వ శర్మ చాలా శ్రమిస్తున్నారు. ఆయన శ్రమ వల్లే ఇప్పుడు అసోం ఆరోగ్య రంగంలో స్వయం సమృద్ధిని సాధించింది. అసోం ప్రజలు మెరుగైన వైద్యం కోసం రాష్ట్రం దాటి వెళ్లకుండా స్థానికంగానే వైద్య వసతులను కల్పించాలనేది తన లక్ష్యమని సీఎం హిమంత నాతో చెప్పారు. బంగాల్, ఈశాన్య రాష్ట్రాల పేద రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించే స్థాయికి అసోంను తీసుకెళ్లాలనే విజన్‌తో హిమంత ఉన్నారు. గతంలో అసోం ప్రజలు క్యాన్సర్ చికిత్స కోసం చెన్నై, ముంబయి, కర్ణాటక, దిల్లీలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఆ చికిత్సను పొందుతున్నారు" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు.

**అమిత్‌షా ప్రారంభించిన ప్రాజెక్టులు, పనులు ఇవే!**

గువహటిలో కొత్తగా నిర్మించిన ప్రాగ్‌జ్యోతిష్‌పూర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌ను అమిత్‌షా ఈసందర్భంగా ప్రారంభించారు.

గోలాఘాట్, తీన్ సుకియా క్యాన్సర్ సెంటర్లను హోంమంత్రి ప్రారంభించారు.

దిఫూ, జోర్హాట్, బార్పేటలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ నిర్మాణ పనులకు అమిత్‌షా వర్చువల్‌గా పునాది రాయి వేశారు.

గువహటిలోని సిక్స్ మైల్ ఏరియాలో స్వాస్థ్య భవన్, అభయపురి జిల్లా ఆస్పత్రి నిర్మాణ పనులకు కేంద్ర హోంమంత్రి పునాది రాయి వేశారు.

# ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందు మమత కీలక ప్రకటన

బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటన చేయడానికి కొన్నిగంటల ముందు సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. హిందూ పురోహితులు, ముస్లిం ముఅజ్జిన్‌ల నెలవారీ గౌరవ వేతనాన్ని మరో రూ.500 చొప్పున పెంచుతున్నట్లు ఆమె వెల్లడించారు. దీని ప్రకారం ఇకపై బంగాల్‌లోని పురోహితులు, ముఅజ్జిన్‌లకు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.2వేల గౌరవ వేతనం లభించనుంది. ఈమేరకు వివరాలతో ఎక్స్ వేదికగా సీఎం మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనాలను పెంచే ఆదేశాన్ని ఇచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని ఆమె వెల్లడించారు. ఈ సమాజపు ఆధ్యాత్మిక, సామాజిక జీవితాల కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు ఎన్నో సేవలు అందిస్తున్నారని మమత కొనియాడారు. గౌరవ వేతనం కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు కొత్తగా సమర్పించిన అన్ని దరఖాస్తులనూ ఆమోదించామన్నారు. మత సామరస్యం, సంప్రదాయ వ్యవస్థలకు మద్దతు అనేవి తమ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన అంశాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతీ సామాజిక వర్గం, సంప్రదాయం వర్ధిల్లే అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సుసంపన్నమైన మన ఆధ్యాత్మిక వారసత్వానికి సంరక్షణకర్తలుగా వ్యవహరిస్తున్న పురోహితులు, ముఅజ్జిన్‌లు గౌరవ వేతనాలకు అర్హులని సీఎం మమత చెప్పారు.

"మాది మా – మాటీ – మనుష్ ప్రభుత్వం. మేం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. ప్రభుత్వ విద్యాసంస్థల లక్షలాది టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లోని ఎయిడెడ్ విద్యా సంస్థల ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన వాగ్దానాలను కూడా నిలబెట్టుకున్నాం. వాళ్లంతా ఆర్ఓపీఏ 2009 కరవు భత్యం (డీఏ) బకాయిలూ 2026 మార్చి నెల నుంచి అందుకుంటారు. రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలు అందుతాయి" అని సీఎం మమత వెల్లడించారు. ఐదో వేతన సంఘం సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపులు, ప్రయోజనాలలో సవరణలు చేసేందుకు రూపొందించిన మార్గదర్శకాలనే రివిజన్ ఆఫ్ పే అండ్ అలవెన్స్ (ఆర్ఓపీఏ) అంటారు. వీటిని అమలు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ బంగాల్‌కు చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆర్ఓపీఏ మార్గదర్శకాల ప్రకారం 2008 ఏప్రిల్ 1 నుంచి 2019 డిసెంబరు 31 వరకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం బకాయిలను ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని కోరింది.

ఉద్యోగ సంఘం వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, 2026 మార్చి 31లోగా 25 శాతం డీఏ బకాయిలను విడుదల చేయాలని బంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని 2025 మేలో ఆదేశించింది. మిగతా 75 శాతం డీఏ బకాయిలపై నిర్ణయాన్ని తీసుకోవడానికి నలుగురు రిటైర్డ్ జడ్జీలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయమని బంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈనేపథ్యంలో డీఏ బకాయిలను ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని సీఎం మమత ఆదేశాలు జారీ చేశారు. ఈనెలలోనే వాళ్లందరికీ డీఏ బకాయిలు అందుతాయని వెల్లడించారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల వేళ ఉద్యోగులు, పెన్షనర్లను ప్రసన్నం చేసుకునేందుకే మమత ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ ప్రకటన తర్వాత ఆదివారం సాయంత్రం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

## హైదరాబాద్‌కు యూకే విద్య

-మొదటిపేజీ తరువాయి

పాఠశాలలు హైదరాబాద్ నగరంలో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ మేరకు యూకే ప్రభుత్వం నుంచి తెలంగాణ సర్కారుకు గ్రీన్ సిగ్నల్ అందింది. అందులో భాగంగా యూకే డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం నేడు రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ సందర్భంగా స్థానిక ఉన్నతాధికారులతో యూకే ప్రతినిధులు కీలక సమాలోచనలు జరపనున్నారు.

**కీలక దశకు చర్యలు**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటు మేరకు అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలోకి ఆహ్వానించేందుకు ప్రజా ప్రభుత్వం తీవ్ర కసరత్తులు చేస్తున్నది. ఈ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంలో 13 యూకే స్కూల్స్‌కు సంబంధించిన రిప్రజెంటేటివ్స్, యూకే ప్రభుత్వ అధికారులు పాల్గొననున్నారు. తెలంగాణలోకి రానున్న ప్రైవేటు విద్యా సంస్థలు, కేజీ టూ ప్లస్ 2 కరికులంలో అగ్రగామిగా పేరొందాయి. స్థానికంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, వివిధ శాఖలు మున్సిపల్, విద్యా, ఐటీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన అధికారులు చర్చించనున్నారు. ఈ విషయంలో మరింత సమన్వయం, యూకే విద్యా సంస్థలు మన రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయేవాటికి ఏ విధమైన టైమ్ లైన్ ను నిర్దేశించుకుని వెళ్ళాలో చర్చలు సాగనున్నాయి. అయితే, యూకేకు సంబంధించిన విశ్వవిద్యాలయాలు సైతం తెలంగాణలో వారి క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలన్నీ ఒక కీలక దశకి చేరుకున్న విషయం విదితమే.

**క్యాంపస్‌లు ఏర్పాటు స్థలాలపై దృష్టి**

ఈ క్యాంపస్‌లు ఎక్కడ పెట్టాలన్న దానిపై తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు సమగ్రంగా చర్చలు చేస్తున్నప్పటికీ, మరొవైపు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇప్పటికే ప్రత్యేకంగా ఒక ఎడ్యుకేషన్ జోన్ లో వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అడుగులు పడుతున్నాయి.

## రూ. 3.2 లక్షల కోట్లతో ప్రజా బడ్జెట్

-మొదటిపేజీ తరువాయి

సందర్భంగా అసెంబ్లీకి సెలవు ఇస్తారు. మార్చి 20వ తేదీన ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. మార్చి 23 నుండి వివిధ శాఖల పద్దులపై చర్చలు ప్రారంభమవుతాయి. మార్చి 30వ తేదీన బడ్జెట్ ఆమోదం పొందిన అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడుతుంది.

**ప్రజా సమస్యలే అజెండాగా**

ఈ పక్షం రోజుల పాటు సాగే సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది. ముఖ్యంగా ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, మూసీ ప్రక్షాళన మరియు హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి అంశాలపై సభలో వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ సమావేశాల కాలాన్ని మార్చి నెలాఖరు వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

## వణికిస్తున్న వడగండ్ల వాన

-మొదటిపేజీ తరువాయి

కురుస్తోంది. రాళ్ల వర్షం కురవడంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం, మెదక్ జిల్లా నర్సాపూర్, శివ్వంపేటలో గాలి దుమారంతో కూడిన వర్షం పడుతోంది. మరో వైపు తెలంగాణలో రాబోయే రెండు గంటలు ఉరుములు ,మెరుపులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మెదక్, సంగారెడ్డి, జిల్లాలలో గంటకు 41 నుంచి 61 కి.మీ వేగంతో (గాలులు) ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు వచ్చే అవకాశం ఉంది. ఆదిలాబాద్, హైదరాబాద్, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, జిల్లాలలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. గంటకు 40 కి.మీ కంటె తక్కువ (గాలులలో) తేలికపాటి ఉరుములతో కూడిన వర్షాలు వచ్చే అవకాశం ఉంది. తెలంగాణకు ఇవాళ్టి నుంచి( మార్చి 16) వచ్చే నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మార్చి16 , 17న తెలంగాణలోని కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులు ,30 నుండి 40 కి.మీ వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. మార్చి 16 న 17 జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. అదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన చేసింది.

## రైతులకు ప్రాణసంకటంగా "గడ్డి మందు"





-మొదటిపేజీ తరువాయి

అందజేశారు. ప్రపంచవ్యాప్తం గా దాదాపు 70కి పైగా దేశాల్లో ఈ ప్రమాదకర రసాయనాలను నిషేధించారని తెలిపారు. కానీ మన దేశంలో ఇవి విచ్చలవిడిగా దొరుకుతు న్నాయని కమిషన్ పేర్కొంది. గ్రామీణ, తండా ప్రాంతాల్లో రైతులు క్షణికావేశంలో వీటిని తాగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూడా ఈ మందుల నిషేధాన్ని సమర్థిస్తోందని, ప్రజారోగ్యం దృష్ట్యా వీటిని అరికట్టాలని నివేదికలో వివరించారు. తెలంగాణలో ఈ మందులను నిషేధించడంతో పాటు, దేశవ్యాప్తంగా వీటిపై నిషేధం విధించేలా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున లేఖ రాయాలని ముఖ్యమం త్రిని కోరాడు. రైతు కమిషన్ ప్రతిపాదనపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి, ప్రాణాంతక మైన ఈ విష రసాయనాలను రాష్ట్రంలో నిషే ధించేలా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# బెంగాల్ 'సర్' తేలేదెప్పుడు?

నిరుడంతా బిహార్‌లో కలకలం సృష్టించి, బెంగాల్‌లో అంతకుమించిన వివాదాలతో గత నెల 28న ముగిసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియలో మొత్తానికి 8.09 శాతం మంది ఓటర్లు... అంటే 60.06 లక్షల మంది జాబితాల నుంచి కనుమరుగై, నికరంగా 7.04 కోట్ల మంది అసలైన ఓటర్లుగా తేలారని ఎన్నికల సంఘం(ఈసీ) చెబుతోంది. జాబితాలో లేనివారు న్యాయనిర్ణయ పరిధి(అజ్యుడికేషన్)లో ఉన్నట్టు లెక్క. ఇలాంటి వారి వినతులను పరిష్కరించటానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో అప్పిలేట్ ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్‌ను మంగళవారం కోరింది. ఈ ప్రక్రియ ముగిశాకే బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలుంటాయా... ముందే పూర్తవుతాయా అన్నది చెప్పేవారు లేరు. సాక్షాత్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమారే ఆ విషయంలో స్పష్టత ఇవ్వటానికి నిరాకరించారు. చాలా అంశాల్లో ఇలా మౌనంగా ఉండిపోవటం ఆయనకు అలవాటే కనుక అందులో ఆశ్చర్యమేమీ లేదు. మన దేశంలో మంచికో చెడుకో అట్టడుగు ప్రజానీకంలో దృఢమైన విశ్వాసం ఒక టుంటుంది. ఓటు హక్కు లేకపోతే మనిషి బతికున్నా చనిపోయినవాళ్లతో సమానమని వారు నమ్ముతారు. నిజానికి అంత నమ్మకం ఉండబట్టే... పార్టీలు దొంగ హామీలిచ్చి నెగ్గుతూ, అటుపై అధికారం వెలగబెడుతూ వంచిస్తున్నా మరో దఫా ఎన్నికల్లో ఓటేయటానికి ఎంతో నిబద్ధతతో క్యూలో



నిలబడతారు. సామాన్యుల్లో ఉన్న ఈ అచంచల విశ్వా సమే మన ప్రజాస్వామ్యాన్ని ఈ మాత్రంగానైనా నిలబెడుతోంది. బిహార్‌లో 'సర్' ప్రక్రియకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లోనే ప్రధాన పోరాటం సాగింది. బెంగాల్ పరిస్థితి భిన్నం. అక్కడున్నది మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కనుక నిరసనలు, ఇతరత్రా ఉద్యమాలు జోరుగానే కొనసాగాయి. అలాగని న్యాయస్థానా లను విస్మరించలేదు. స్వయానా మమత సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ఎంతో ఊరటనిచ్చేవి. ఎందుకంటే ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు గోడు చెప్పుకోవటానికి హైకోర్టు పర్యవేక్షణలో అప్పిలేట్ ట్రిబ్యునళ్లు ఏర్పడతాయి. నిర్ణయాధికారం అధికారులకే అప్పగిస్తే ఇష్టానుసారం చేస్తారన్న భయం ఉండేది. కానీ ట్రిబ్యునళ్లు ఈ సమస్య లేకుండా చేశాయి. నిజానికి ఈ వివాదానికి మూలం ఈసీ తీరులో ఉంది. ఫలానా ప్రాంతంలో ఓటరుగా నమోదైన వ్యక్తి ఇక్కడ ఉండటం లేదనో, దొంగ ఓటరనో ఫిర్యాదు చేయడానికి 'ఫామ్--7' వెసులుబాటు ఉంది. అయితే అలా ఫిర్యాదు చేసినవారి వివరాలు చాలా సందర్భాల్లో సక్రమంగా లేవు. ఎదుటి పార్టీకి పట్టున్న ప్రాంతాల్లోని ఓటర్లు నకిలీలని వచ్చిన ఫిర్యాదులు కోకొల్లలు. దాదాపు అన్ని పార్టీలూ ఈ పనిచేశాయి. వాటి ఆధారంగా ఓటర్లకు నోటీసులీయటం, పత్రాలు తీసుకురావాలని ఆదేశించటం, తీరా నిబంధనల ప్రకారం 2002 రికార్డులతో లింక్ లేని (అన్‌మ్యాప్‌డ్) సంగతి బయటపడటం, పేర్లలో అక్షరక్రమం కొంచెం తేడావచ్చినా అనర్హులుగా జమవేయటం సాధారణ ఓటర్లకు తలనొప్పిగా మారింది. చిత్రమేమంటే ఒక బీజేపీ నాయకురాలి పేరుమీద దాఖలైన ఫిర్యాదుల సంగతి అధికారులు చెబితేగానీ ఆమెకు తెలియలేదు. దొంగ ఫిర్యాదులపైనా, వాటి ఆధారంగా నిర్ణయం తీసుకున్న వారి పైనా వెనువెంటనే చర్యలుంటే ఈ అరాచకం ఆగేది. కానీ దానికి సమయం పడుతుంది. బంగ్లాదేశ్‌కు పొరుగున ఉండటం బెంగాల్ ముస్లింలకు తలనొప్పిగా మారింది. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగినవారు కూడా అక్రమ వలసదారులన్న ఫిర్యాదులతో అందు కవసరమైన పత్రాలు సేకరించలేక, పత్రాలున్నా పరిశీలనలో పేర్లలో కనబడిన స్వల్ప తేడా వల్ల జాబితాల నుంచి గల్లంతైనవారు అనేకులు. ఇలాంటి సమస్యలుంటాయని ఎన్నికల సంఘం ముందే అంచనా వేసి, తరుణోపాయం సూచిస్తే ప్రజలు న్యాయ స్థానాలకెక్కే అవసరం ఉండకపోయేది. కానీ ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు పూర్తయి రెండేళ్లు కావస్తున్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులపై ఇంతవరకూ ఉలుకూ పలుకూ లేకుండా మిగిలిపోయిన ఎన్నికల సంఘం ఇంతకన్నా మెరుగ్గా ఎలా ఉంటుంది? నిజమైన ఓటర్లకు సత్వరన్యాయం లభించాలని కోరుకోవటం మినహా ఎవరూ చేయగలిగింది లేదు.

# వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడం ఎలా !




పది మాసాల పాఠశాల లేదా కళాశాల విద్యా సంవత్సరం పూర్తి కావడం, ఆ తర్వాత పరీక్షలు కూడా పూర్తి అయిన తర్వాత మానసిక ఉల్లాసానికి ఆతిథ్యం ఇచ్చే వేసవి సెలవుల రాక కోసం విద్యార్థిలోకం ఎంతగానో ఎదురుచూడడం జరుగుతుంది. ఏడాదిలో ఒక్కసారి లభించే రెండు మాసాల వేసవి సెలవులు యువతకు ఎన్నో రకాల అనుభవాలను మూటకట్టి పెడతాయి. ఊపిరాడనంతగా ఒకే రకమైన యాంత్రిక జీవనశైలి గడిపిన విద్యార్థులు విద్యాలయ దిన చర్యకు దూరం జరిగి వేసవి సెలవుల్లో కొన్ని వారాల పాటు విశ్రాంతి, వినోద విరామాలను పొందుతూనే తమకు నచ్చిన పసందైన కార్యక్రమాలకు ప్రాణం పోసేందుకు యువత ఉవ్విళ్లూరుతూ ఉంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో స్వేచ్ఛగా, సరదాగా గడపడానికి వేదికలుగా వేసవి సెలవులు ఉపయోగపడతాయి. హోమం వర్క్, పరీక్షలు, తీరిక ఇవ్వని అకడమిక్ కార్యక్రమాలు, నోట్స్ రాయడం, బడి గంటలకు దూరంగా తమకు నచ్చిన రీతిలో వేసవి సెలవులు గడపడానికి పిల్లలు పథకాలు వేస్తూ ఉంటారు. మానసిక ఒత్తిడి నుంచి బయటపడి తమ అభిరుచులు, ఆసక్తి కలిగిన పనులు, ఆటపాటలు, ఆన్‌లైన్‌లో మునకలు, సినిమాలు, పర్యాటక ప్రయాణాలు, క్రీడా ప్రాంగణాలకు పరుగులు, అమ్మ చేతి వంట రుచులు, దర్శనీయ స్థలాల పయనాలు, వినోద విజ్ఞాన వేదికలు, ఆరోగ్యం కాపాడుకునే కార్యాలు, మానసిక ఉల్లాస విందులు, సృజన/విలక్షణ ఆలోచనలు, తమకు నచ్చిన ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణల కోరికలు లాంటి అనేక ప్రణాళికలను నిజం చేసుకునే సమయంగా వేసవి సెలవులు ఉపకరిస్తాయి. వినోద, విరామ, పునరుత్తేజ కార్యక్రమాలు: అవసరం మేరకు నిద్ర పోవడం, మెదడు చురుదనం పెంచడానికి కార్యక్రమాలు, మనసుకు నచ్చిన కార్యక్రమాలు చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించే అంశాలకు సమయం ఇవ్వడం వేసవి సెలవుల్లో మాత్రమే జరుగుతుంది. తమకు నచ్చిన అంశాలకు చెందిన పుస్తకాలు చదవడం, విజ్ఞాన వినోదాత్మక సినిమాలు చూడడం, సుస్వర సంగీతం వినడం, ఆటపాటల్లో మునిగి తేలడం, కుటుంబ సభ్యులు లేదా మిత్రులతో కలిసి బయటకు వెళ్లడం లాంటివి మానసిక వికాసానికి, మనసును తేలిక పర్చుకోవడానికి ఉపకరిస్తాయి. మన ప్రేమను చూరగొన్న సమీప బంధువులు లేదా మిత్రుల వద్దకు వెళ్లడం, పిక్నిక్/జూ/సర్కస్/ఎగ్జిబిషన్‌లకు వెళ్లడం, మనకు నచ్చిన క్రీడలు లేదా కళల్లో శిక్షణ తీసుకోవడం, వ్యక్తిత్వ వికాస ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ తరగతులకు హాజరుకావడం లాంటివి మంచి నిర్ణయాలు అవుతాయి. కొత్త ప్రదేశాలు, ప్రకృతి సహజ అందాల ఆస్వాదనలు, సాహస క్రీడలు, ప్రకృతిలో దాగిన అద్భుతాల ఆవిష్కరణలు, ఈత నేర్చుకోవడం, సైక్లింగ్ లేదా బైక్ నేర్చుకోవడం, మనకు నచ్చిన అభిరుచులను పెంచి పోషించుకోవడం, కుటుంబ సభ్యులతో సరదాగా గడపడం, అమ్మ ఒడిలో తల వాల్చడం, నాన్న చేయి వదలక ముందడుగు వేయడం, సామాజిక సంబంధాలను పటిష్ట పరుచుకోవడం, మానవ సంబంధాలను పెంచుకోవడం, సహకార భావనలతో పది మందితో కలిసి పని చేయడం లాంటి పలు కార్యక్రమాలకు వేసవి సెలవులు నెలవులు కావాలి. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం లేదా హాజరు కావడం, వేసవిలో పార్ట్‌టైమ్ విద్య సంబంధ ఉద్యోగాలు చేయడం, ప్రయాణాలు చేస్తూ వినోద విజ్ఞానాలను పెంచుకోవడం, వ్యవసాయ క్షేత్రాల్లో గడపడం లాంటివి పిల్లల వ్యక్తిత్వాలను, అవగాహన శక్తులను మెరుగు పరుచుతాయి. ఆధునిక డిజిటల్ కాలపు నైపుణ్య వికాస కార్యక్రమాలు: నేటి ఆధునిక డిజిటల్ యుగంలో పుట్టుకొస్తున్న శాస్త్రసాంకేతిక ప్రగతి ఫలాలను ఆస్వాదించడం లేదా నూతన నైపుణ్యాలను అవపోసన పట్టడం, సంగీతం/నాట్యం/ పేయింటింగ్ నేర్చుకోవడం, సంగీత వాయిద్యాల్లో శిక్షణలు, కవిత్వం/వ్యాస రచన/కథలు రాయడంతో సాహిత్య రంగంలో తొలి అక్షర అడుగులు వేయడానికి వేసవి సెలవులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆసక్తి కలిగిన వారు కొత్త భాషను నేర్చుకోవడం, డిజిటల్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యాలకు పదును పెట్టడం, జనరల్ నాలెడ్డి పెంచుకోవడం, దిన పత్రికలను చదవడం, పాఠ్యాంశాలకు సంబంధించిన అదనపు పరిజ్ఞానాలను పొందడం, మానసిక పరిపక్వతకు ఆజ్యం పోసే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరు కావడం లాంటివి పిల్లలకు అందుబాటులో ఉంచాలి. నైపుణ్యాలు, విజ్ఞానం, సామర్థ్యాలకు పదును పెట్టడం లాంటివి మరువరాదు. సృజనశీల అంశాల్లో అడుగు పెట్టడంతో పాటు ఇన్నొవేటివ్ ఆలోచనలు చేయడం మన పిల్లల శారీరక మానసిక భావోద్వేగ వికాసానికి దోహదపడతాయి.

**ఆరోగ్య పరిరక్షణ – నవ్య జీవనశైలి కార్యక్రమాలు:** నేటి ఆరోగ్యమే రేపటి భవితకు పెట్టుబడి అని, ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్ముతూ వేసవి సెలవుల్లో ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి. తగినంత సమయం నిద్ర పోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, పరిమిత సమయం పాటు ఆటపాటలకు కేటాయించడం, ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం/యోగా/ ప్రాణాయామం/ వాకింగ్/స్విమ్మింగ్/ట్రెక్కింగ్/మౌంటెనీరింగ్ చేయడం, సూర్యోదయాన్ని చూసి ఆనందించడం మరువరాదు. వీటికి తోడుగా తోట పనుల్లో నిమగ్నం కావడం, పర్యావరణ పరిరక్షణ సేవలు, నిస్వార్థ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, శ్రమదాన కార్యక్రమాలు చేయడం, అనాథాశ్రమాలను సందర్శించి వారికి చేతనైనంత తోడ్పాటు ఇవ్వడం, నేచర్ ట్రెజర్ హంట్ చేయడం, ఇష్ట దైవానికి పూజ చేయడం, దేవాలయాలు లేదా ప్రార్థనా స్థలాలను సందర్శించడం లాంటివి చేయడం ఉత్తమం అని భావించాలి.

**చేయగూడని కార్యక్రమాలు – తల్లితండ్రుల పాత్ర:** పిల్లలు వేసవి సెలవులను సమర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా గడపడంలో తల్లితండ్రుల పాత్ర అధికమని గమనించాలి. వేసవి సెలవుల రూపంలో లభించిన రెండు మాసాల్లో పిల్లల దురలవాట్లు లేదా అనారోగ్యకర దినచర్యలకు అలవాటు పడకుండా చూసుకోవడం పెద్దల కనీస కర్తవ్యం అని తెలుసుకోవాలి. అధిక కాలం పాటు స్మార్ట్‌ఫోన్ వాడడం లేదా టీవీ ముందు కూర్చోవడం మంచి అలవాటు కాదని వారించడం మరువరాదు. కరోనా లాక్‌డౌన్ వల్ల పిల్లలు స్మార్ట్‌ఫోన్ బానిసలుగా మారడం చూసాం. ఆన్‌లైన్ గేమ్స్‌కు బదులుగా అవుట్/ఇండోర్ డోర్ గేమ్స్ ఆడడం ఉత్తమమని నమ్మాలి. వేసవి ఎండలను గమనిస్తూ, గంటల తరబడి మైదానాల్లో ఆడకుండా, వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అతి నిద్ర లేదా అతిగా తినడం లేదా అతి గారాబానికి ఆస్కారం ఇవ్వకండి. డ్యాన్స్, ఫైన్ ఆర్ట్, స్విమ్మింగ్, సైక్లింగ్, మ్యూజిక్, ఆటలు లాంటివి నేర్పించండి. వేసవి సెలవులు పూర్తి స్వేచ్ఛకు నెలవులు కావని, వినోదంతో పాటు విజ్ఞానం, ఆటపాటలతో పాటు శారీరక మానసిక వికాసం, ఆన్‌లైన్‌లో సంచరిస్తూ దురలవాట్ల కోరల్లో పడకుండా రేపటి బాధ్యత కలిగిన పౌరులుగా మారడానికి నేటి పిల్లలకు వేసవి సెలవులు ఉపయుక్తం కావాలని కోరుకుందాం. పిల్లల అభిరుచులను గమనిస్తూ వేసవి సెలవుల్లో వారి వ్యక్తిత్వ వికాసం జరిగే విధంగా, విజ్ఞానవంతులుగా మారడానికి తల్లితండ్రులు పటిష్ట ప్రణాళికలు వేసి వాటిని పక్కాగా అమలు చేయాలి. వేసవి సెలవులను వ్యర్థం చేయవద్దు. సెలవుల కాలం సకల నైపుణ్యాలను వద్దించే నెలవుగా మారాలని కోరుకుందాం.

# అభినవ కవితా యుగ సంస్థాపకులు రాయప్రోలు



"ఏ దేశమేగినా ఎందుకాలిడినాఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన పొగడరా నీ తల్లి భూమి భారతినినిలుపరా నీ జాతి నిండు గౌరవము"...అంటూ "జన్మభూమి" గీతాన్ని రచించి.. తెలుగు జాతి గౌరవాన్ని ఎలుగెత్తి చాటిన సుప్రసిద్ధ రచయిత, కవి రాయప్రోలు సుబ్బారావు. నవ్య కవితా పితామహునిగా పేరుపొందిన రాయప్రోలు సుబ్బారావు (మార్చి 17, 1892 – జూన్ 30, 1984) తెలుగులో భావ కవిత్వానికి ఆద్యులు. ఈయన 1913లో వ్రాసిన తృణ కంకణముతో తెలుగు కవిత్వములో నూతన శకము ఆరంభమైనదని అంటారు. జాతీయోద్యమ కవిత్వాన్ని పుష్కలంగా రచించిన కవి రాయప్రోలు సుబ్బారావు. "నాదు జాతి, నాదు దేశము, నాదు భాష అను అహంకార దర్శనమందు" అని ప్రబోధిస్తూ జాత్యభిమానం, దేశాభిమానం, భాషాభిమానం ప్రతి ఒక్కరికీ నరనరాల్లో జీర్ణించుకు పోయేలా ఆయన సృజన చేశారు. ఒక కొత్త మార్గాన్ని పలుకుబడిని, భాషను దర్శనాన్ని ఇచ్చి నూతన యుగానికి సంస్థాపకుడుగా వెలసిన వారు రాయప్రోలు సుబ్బారావు. అభినవ కవితాయుగానికి ఆయన సంస్థాపకులు. నన్నయ్య తర్వాత తెలుగు కవిత్వ భాష ఆమూలంగా పరివర్తనం పొందింది రాయప్రోలు వల్లనే. ఆయన తెలుగు సంస్కృత భాషలే కాకుండా. రవీంద్రుని ప్రభావంతో భారతీయ జాతీయతా భావాలను కొత్త ఒరవడిలో తెలుగు కవితలో ప్రవేశపెట్టారు. రాయప్రోలు పరిపక్వమతులు, పాశ్చాత్య సాహిత్య విశారదులు, నవ్య కవితోపాసకులు. పాశ్చాత్య కవుల ప్రకృతి ఆరాధనా విధానాన్ని ఆకళింపు చేసుకున్న తెలుగు కవి. పాశ్చాత్య దేశాలలో పరిమళించిన ఈ భావుకతను రాయప్రోలు తెలుగులో సుసంపన్నం చేశారు. భావ కవిత్వోద్యమానికి నాయకత్వం వహించి, తృణకంకణం, స్నేహలత, ఆంద్రావళి, జడ కుచ్చులు లాంటి రచనలు చేసిన ఆయనకు 'కోకిలస్వామి' అనే బిరుదు ఉంది. సంస్కృత రచనలపై అతిగా ఆధారపడిన తెలుగు కవిత్వాన్ని స్వతంత్ర రచనలవైపు మళ్ళించారు. రాయప్రోలుది కేవలం అనుకరణ కాదు. తెలుగు, సంస్కృత భాషా పటిమను ఆయన వీడలేదు. సమకాలీన సమాజానికి అనుగుణంగా భావుకతను అల్లి తెలుగు కవితకు క్రొత్త సొగసులు అద్దారు. రాయప్రోలు గొప్ప జాతీయవాది. అంతేకాదు. తెలుగు జాతి అభిమాని. ఆయన దేశభక్తి గేయాలు ఎంతో ఉత్తేజకరంగా ఉంటాయి. అయన వ్రాసిన గీతాలలో అందరినోళ్లలోనూ బాగా నానిన జన్మభూమి" గీతంలో తెలుగుదనం, జాతీయాభిమానం, గత వైభవ సంకీర్తనం, ప్రబోధం లాంటివి తొణికిసలాడుతాయి. ఇప్పటికీ ఈ గీతం ఉత్తమ దేశభక్తి ప్రబోధంగా నిలిచిందనడంలో అతిశయోక్తి లేదు. "అవమానమేలరా! అనుమానమేలరా! భారతీయుడ నంచు భక్తితో పాడ...లేరురా మనవంటి వీరులింకెందు...ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో జనియించినాడ వీ స్వర్గఖండమున ఏ మంచి పూవులన్ ప్రేమించినావో నిను మోచె ఈ తల్లి కనక గర్భమున...లేదురా ఇటువంటి భూదేవి యెందూ లేరురా మనవంటి పౌరులింకెందు. సూర్యుని వెలుతురుల్ సోకునందాక ఓడలా ఝండాలు ఆడునందాక...అందాక గల ఈ అనంత భూతలిని మన భూమి వంటి చల్లని తల్లి లేదు పాడరా నీ తెలుగు బాల గీతములు పాడరా నీ వీర భావ భారతము". ఇంతకంటే గొప్ప దేశభక్తి పూరిత కవిత్వం ఇంకేముంటుంది.

1918లో ఉస్మానియా విశ్వ విద్యాలయం స్థాపించ బడి, తెలుగు శాఖ ఏర్పడటం జరిగాక, .. ఆయన ఉస్మానియా తెలుగు శాఖకు తొలి ఆచార్యుడిగా నియమింప బడ్డారు. ఆనాడు తెలుగు శాఖలో చదువుకున్న విద్యార్థుల్లో పల్లా దుర్గయ్య, అనుముల కృష్ణమూర్తి, ఠంయాల రంగాచార్యులు, అలాగే జువ్వాడి గౌతమరావు లాంటి వారు ఎందరో ఉన్నారు. 1958 ప్రాంతాల్లో జువ్వాడి గౌతమరావు జయంతి పత్రిక నడిపేవారు. దాన్లో సాహిత్యధార అనే శీర్షికను నిర్వహించేవారు. రాయప్రోలు అందులో రచనలు చేసేవారు. కాళిదాస మేము సందేశాన్ని దూత మేఘము అన్న పేరుతో యతి ప్రాసలు లేకుండా రాయప్రోలు వారు రచించగా, పలువురి విమర్శలకు గురైనారు.ఆయన ఒక పక్క కవిత్వంలో తెలుగు ప్రజల వంటి ధీరులింకెందునూ లేరని, ఏదేశ మేగినా జాతిగౌరవం నిలపాలని వ్రాస్తూనే, మరొక పక్క తెలంగాణలో ప్రజలు రాజ్యంతో వీరోచితంగా పోరాడు తూండగా నైజాం రాజ్యాన్ని పొగుడుతూ రచించారన్న పేరు మూట కట్టుకున్నారు. రవీంద్రుని శిష్యుడైన రాయప్రోలు సుబ్బారావు నిజాం ప్రభువునకు అనుకూలంగా ప్రవర్తించడం.. ప్రజలకు వ్యతిరేకంగా ఉండటం నాటి జాతీయోద్యమ నాయకులకు నచ్చలేదు. "కోకిల స్వామి" బిరుదాంకితుడు అయిన రాయప్రోలు గురించి, కాళోజీ నారాయణరావు నా గొడవలో ...'ఓ కోయిలా.. ఏ మావి చివురులు తిని ఎవరిని పాడుతున్నావు?' రాయప్రోలును ఉద్దేశించి ఒక గేయం రాశారు. కట్టమంచి రామలింగారెడ్డి ఆయనను స్తుతించారు. రాయప్రోలు కవిత్వాన్ని జాతీయ భావ ప్రేరకంగా దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వంటి కవిత్వ ప్రేమికులు భావించి 1913 నాటి బాపట్ల ఆంధ్ర మహాసభల్లో వాటిని గానం చేయడం విశేషం.రాయప్రోలువారి సప్తతి సందర్భంలో విజయవాడలో జరిగిన సభలో...తాను రాయప్రోలు వల్ల ప్రేరణ పొందినట్లు తొలి రచనలు చేసినట్లు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పేర్కొనడం గమనార్హం.రాయప్రోలు జూన్ 30, 1984న మరణించారు.

## నిజాం వ్యతిరేక పోరాట యోధుడు మందుముల

మందుముల నరసింగరావు (మార్చి 17, 1896 – మార్చి 12, 1976) నిజాం విమోచన పోరాట యోధుడు, రాజకీయ నాయకుడు, పత్రికా రచయిత, న్యాయవాది, ఆంధ్ర జనసంఘ స్థాపకులు, సంఘ సంస్కర్త, పాలమూరు జిల్లాకు చెందిన సమరయోధుడు మందుముల నరసింగరావు మార్చి 17, 1896 న ప్రస్తుత రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో జన్మించారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన నరసింగరావు న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు అయినారు. పర్షియన్ భాషలో కూడా అయన గొప్ప పండితులు, పత్రికా రచయితగా పేరు పొందారు. 1921లో ఆంధ్ర జనసంఘాన్ని స్థాపించిన వారిలో ఒకడు. 1927లో న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి పత్రికారచన, రాజకియాలు చేపట్టారు. 1927లో రయ్యత్ అనే ఉర్దూ వార్తాపత్రిక స్థాపించి సంపాదక బాధ్యతలు చేపట్టారు. మందుముల, సమర రంగంలో కూడా కీలకపాత్ర వహించి 1937లో ఇందూరు (నిజామాబాదు) లో జరిగిన 6వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. 1938–42 కాలంలో నిజాం లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. 1947లో జాయిన్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యారు. బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషి చేశారు. 1952లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యారు. 1957–62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పని చేశారు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించారు.

# రోగనిరోధక శక్తిపై అవగాహన

**మహబూబాబాద్ జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

రోగనిరోధక శక్తిపై అవగాహన వాక్సిన్ ప్రైవేంటిబ్లె డీజీసెస్ నివారించగల వ్యాధులపై అవగాహనానతో సమాజంలో పిల్లలను, తల్లులను వ్యక్తులను రక్షించడంలో టీకా కార్యక్రమం ప్రాముఖ్యత, ప్రధాన పాత్రను సమాజంలో అందరికీ తెలియ చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాతృ, శిశు మరణాలను గణనియముగా తగ్గించటంలో వ్యాధి నిరోధక టీకాలు ముఖ్య భూమిక వహిస్తాయని, వ్యాధులు నివారించడం, వ్యక్తుల ప్రాణాలను కాపాడటం రోగనిరోధకత ఆధునిక వైద్యంలో అత్యంత శక్తివంతమైన సాధనాలలో ఒకటని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా టీకా ప్రయత్నం కారణంగా 1980లో ప్రపంచవ్యాప్తంగా మశూచి నిర్మూలించబడింది ఇది గొప్ప ప్రజారోగ్య విజయాలలో ఒకటి. ఒకప్పుడు పోలియోతో వేలాది మంది పిల్లలు పక్షవాతం వచ్చినా, ఇప్పుడు నిర్మూలన అంచున ఉంది, సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమము,కారణంగా క్షయ, పోలియో రోట, కంఠ సర్పి, కోరింథ దగ్గు, ధనుర్వతం, మీజిల్స్, హెపటైటిస్ బీ , ఇన్ఫుఎంజా,




ఎల్లో ఫీవర్, వలన వ్యాధులు గణనీయంగా తగ్గించబడ్డాయి, నియంత్రించబడ్డాయి, రోగ నిరోధక శక్తి సన్నగిల్లినపుడు, టీకా కార్యక్రమం క్రమం తప్పితే, నియంత్రించబడిన పాత వ్యాధులు త్వరగా తిరిగి వ్యాప్తి చెందుతాయన్నారు. టీకాలు ప్రాణాలను కాపాడటమే కాకుండా ఆరోగ్య సంరక్షణ ఖర్చులు మరియు అనారోగ్యంతో ముడిపడి ఉన్న ఆర్థిక నష్టాలను కూడా తగ్గిస్తాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఇమ్యూనిజషన్ కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి ఆరోగ్య సంరక్షణ పొదుపు మరియు ఉత్పాదకతలో 16 రెట్లు తిరిగి వస్తుందని తెలుస్తోందనీ, ప్రజారోగ్య వ్యవస్థలో వ్యక్తులందరు సమిష్టి బాధ్యతతో అర్హులైన వారికి టీకాలు వేయడం అనేది చాలా ముఖ్యం అని దీనివలన దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా కోట్లమంది ప్రాణాలు కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిది యూఐపీ తో పాటు తల్లిపాల ప్రాధాన్యత, బిడ్డకు 6నెలల వరకూ కేవలం తల్లి పాలు మాత్రమే ఇచ్చుట, ఆసుపత్రిలో మాత్రమే 100శాతం కాన్పులు, పౌష్టికహార సేవలు బలోపేతం చేయటం, వ్యక్తిగత, పరిసరాల పారిశుధ్యశీ వలన వ్యాధినిరోధక టీకా కార్యక్రమానికి మరింత బలం చేకూరుస్తుందనీ ఆయన పేర్కొన్నారు. సకాలంలో, సరైన మొతాదులో, సరైన శీతళీకరణం ద్వారా అవసరమైన టీకాలు తీసుకొనుట వలన రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోని ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించవచ్చునని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# జిల్లాలో ఉద్యోగ మేళ
# యువత సద్వినియోగం చేసుకోవాలి

**మహబూబాబాద్ జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, మహబూబాబాద్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించుటకు చీ××ు సంస్థ ద్వారా ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్ నందు సేల్స్, రిలేషన్షిప్ మేనేజ్మెంట్ ఉద్యోగాల భర్తీకి తేది18-03-2026 న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. పురుష అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగానికి అర్హులని, అభ్యర్థులు ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత (ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు) ఉండి 25 సంవత్సరాల లోపు వయస్సు తో కమ్యూనికేషన్ మరియు ఇంటర్ పర్సనల్ స్కిల్స్ ఉండాలని, అభ్యర్థులకు సేల్స్ మరియు రిలేషన్షిప్ మేనేజ్మెంట్ రంగంలో పని చేయడానికి ఆసక్తి ఉండాలని ఇంజనీరింగ్, డిప్లొమా ఇంజనీర్, సీఏ, ఎంబీఏ అర్హతలు ఉన్నవారు అర్హులు కారని, విద్యలో



గ్యాప్ లేకుండా ఉండాలని అన్నారు. ఎంపిక అయిన అభ్యర్థులకు సుమారు వార్షిక వేతనంగా ?3.2 లక్షలు (సీటీసీ) వరకు ఉంటుందని అన్నారు. ఎటువంటి అప్లికేషన్ ఫీజు లేదని, ఎటువంటి ట్రైనింగ్ ఫీజు లేదని నిట్ ద్వారా 15 రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఉంటుందని, ట్రైనింగ్ పూర్తి చేసిన తరువాత ఐసీఐసీ బ్యాంకులో నేరుగా ఉద్యోగ అవకాశం కల్పించబడుతుందని అన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు ప్రతులతో తేది 18-03-2026 న ఉదయం 10.30 గంటలకు మహబూబాబాద్ లో జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయం, రూమ్ నెం. 25, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, కురవి రోడ్, మహబూబాబాద్ లో గల జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయంలో జరుగు జాబ్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**

**మహబూబాబాద్ జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లాలోని అన్ని విభాగాల అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా వ్యాప్తంగా ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి కచ్చితంగా సమాధానం ఇస్తూ తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెండింగ్ ఫైళ్ళ పరిష్కారం, కార్యాలయాల పరిశుభ్రత తదితర అంశాలను కచ్చితంగా అమలుపరచాలని, పరిష్కరించిన ఫైళ్ళ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని అన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల అధికారులు, క్షేత్రస్థాయి మండల అధికారులకు సూచించారు. సీనియర్ సిటిజన్స్, భూ సంబంధిత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వ్యవసాయం, ఇరిగేషన్, దివ్యాంగుల పెన్షన్, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు. మండల ప్రధాన కార్యాస్థానం నుండి గూగుల్ మీట్ ద్వారా సంబంధిత ఇనుగుర్తి, గార్ల, డోర్నకల్, కేసముద్రం, చిన్న గూడూరు, తహసిల్దార్లతో భూ సమస్య పరిష్కారం చేయుటకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సోమవారం దంతాలపల్లి మండలం తూర్పు తండ గ్రామ పంచాయతీకి చెందిన గుగులోతు నాగమణి తనకు చెందిన భూమిని నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వగా భవన నిర్మాణానికి మంజూరి ఉత్తర్వులు ఇవ్వగా ఇప్పుడు కొత్తగా ఎన్నికైన పాలక వర్గం అట్టి భవన నిర్మాణం మరొక స్థలంలో



నిర్మించుచున్నారని, ఇట్టి విషయంలో హైకోర్ట్ వారిని సంప్రదించామని, విచారణ చేసి హైకోర్టు నుండి తీర్పు వెలువడే వరకు అట్టి గ్రామ పంచాయతీ భవనానికి నిధులు మంజూరు చేయకుండా నిలుపుదల చేయమని కోరారు. డోర్నకల్ మండల కేంద్రంలోని యాదవ నగర్ కు చెందిన బొల్లం విజయ తన పేరు మీద మహబూబాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తన ఇంటి పట్టా భూమిని గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసారని అక్రమంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని పరిశీలించి తమ స్థలాన్ని తమకు ఇప్పించాలని కోరారు. నెల్లికుదురు మండలం శ్రీరాం నగర్ గ్రామం శివారు వెంకటాపూరు కు చెందిన బుర్ర కర్ణాకర్ తాను దివ్యాంగుడినని వికలాంగుల స్కూటి ఇప్పించగలరని కోరారు. కురవి మండల కేంద్రానికి చెందిన నిమ్మల భిక్షం తనకు ఉన్న సర్వే నెంబర్ లో గల భూమి రోడ్డు అని చూపిస్తుందని దానిని సరిచేసి వ్యవసాయ భూమిగా మార్చి పట్టా పాసు పుస్తకము ఇప్పించగలరని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో వివిధ శాఖలకు సంబంధించి (156) వచ్చిన దరఖాస్తులకు సంబందిత అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని జిల్లాల కార్యాలయ అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలోని దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణిలో అందచేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 52 దరఖాస్తులు స్వీకరించి తక్షణ చర్యలకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. అట్టి దరఖాస్తులను అధికారులు జాప్యం చేయక పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన



అన్ని దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారని, అందువల్ల అధికారులు దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థలు ఆదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి జాతర కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



**కుత్బుల్లాపూర్, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి సర్కిల్ దూలపల్లి డివిజన్ లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి జాతర కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రమరామిక మల్లికార్జున స్వామి వారి జాతర కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు దేవేందర్ యాదవ్, రవీందర్ (సంజీవ్) యాదవ్, పాక్స్ డైరెక్టర్ జీతయ్య, దుండిగల్ సర్కిల్ బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ శామీర్పేట్ రంగయ్య, దుండిగల్ సర్కిల్ యూత్ అధ్యక్షులు మైసిగారి శ్రీకాంత్, స్థానిక నాయకులు పెంటయ్య యాదవ్, రమేష్ యాదవ్, దేవేందర్ యాదవ్, పవన్ యాదవ్, యాదయ్య యాదవ్, మదన్ యాదవ్, నరేందర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, మరియు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు**



**ములుగు జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 46 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 13, ఇందిరమ్మ ఇండ్లు 04, పెన్షన్ 06, ఉద్యోగల కల్పన 06, ఇతర శాఖలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంపత్ రావు మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలుకు జనాభా గణన కీలకం

**అధికారులకు రెండో రోజు శిక్షణ**

**ములుగు జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**



దేశాభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలుకు జనాభా గణన--2027 కీలకమని అధికారులు తెలిపారు. జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రం లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్స్ కార్యాలయానికి చెందిన గణాంక అధికారులు హోబాలాల్, సరళ శిక్షణ ఇచ్చారు. జిల్లాలో జనాభా గణన--2027 నిర్వహణకు సంబంధించి జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు గణన ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈసారి దేశంలో తొలిసారిగా జనాభా గణనను డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌ల ద్వారా గణన ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. అదేవిధంగా ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలు, పట్టణాల్లోని వార్డులను గణన బ్లాకులుగా విభజించే విధానం, గణన నిర్వహణకు సంబంధించిన విధానాలపై అధికారులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనాభా లెక్కల అధికారి సి పి ఓ ప్రకాష్, గణాంక అధికారి లాల్, అన్ని మండలాల తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారిణి టైగర్ నర్సమ్మ మృతి

**మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి హరీష్ రావు**

**సిద్దిపేట, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**



సిద్దిపేట పట్టణానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ఉద్యమకారిణి టైగర్ నర్సమ్మ అనారోగ్యం తో మృతి చెందింది.. ఆమె మృతి పట్ల మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సంతాపం వ్యక్తం చేశారు. మొదటి నుండి కెసిఆర్ వెన్నంటే ఉన్న ఉద్యమకారిణి అని, కెసిఆర్ కి నాకు ఎంతో ఆత్మీయురాలు అని ఆమె మృతి బాధాకరమన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి నెటి వరకు పార్టీలో ఎంతో క్రియాశీలకంగా పని చేసిందని ఉద్యమ సమయంలో మహిళా లోకాన్ని ఒక్క తాటి పైకి తెచ్చిందని, ఆమె పటిమను గుర్తించి స్వయంగా కెసిఆర్ టైగర్ నర్సమ్మగా పేరు ఇచ్చారని అలాంటి గొప్ప ఉద్యమ కారిణి, ఒక నిబద్ధత గల నాయకురాలుగా 25ఏళ్లు పార్టీ కి అందించిన సేవలను కొనియాడారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటని ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

# జిల్లాస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

## బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత
## అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు

**ములుగు జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశమును జిల్లా సంక్షేమ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు హాజరై మాట్లాడుతూ మన జిల్లాలో నూతనంగా జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ జిల్లా బాలల పరిరక్షణ కమిటీ జిల్లా కలెక్టర్ చైర్మన్ గా 14 మంది జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. జిల్లాలో ఉన్న మండల, గ్రామ, వార్డు బాలల పరిరక్షణ కమిటీలను సమన్వయం పరుస్తూ జిల్లాలోని బాలలకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తుందని అన్నారు. జిల్లాలోని బాలల రక్షణ పై అవగాహన కల్పించడం, ఆరు సంవత్సరాల పైబడిన బాలలందరూ బడికి వెళ్లేలా చూడడం, బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించడం, బాలల హక్కులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించడం, గ్రామ సభల్లో బాలల గురించి చర్చించేలా చూడటం, బాల్యవివాహాల వల్ల, పిల్లలను పనిలోకి పంపించడం వల్ల ఎదురయ్యే అనర్థాలను గుర్తించి అవగాహన



కార్యక్రమాల నిర్వహిస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలను బాలల స్నేహపూర్వక గ్రామంగా, బాలల ఆదర్శ గ్రామాలుగా మార్చేందుకు కృషి దిశగా జిల్లా బాలల పరిరక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని బాలల హక్కుల సంరక్షణ కొరకు పని చేసే జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ హెల్ప్ లైన్ తదితర సంస్థలని పర్యవేక్షిస్తూ ఉన్నతమైన సేవలను బాలలకు అందేలాగా ఈ కమిటీ చూస్తుందనీ జిల్లా సంక్షేమ అధికారిని ప్రేమలత తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె ఓంకార్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ ద్వారా జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను కమిటీ సభ్యులకు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ కమిటీ సభ్యులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వివిధ జిల్లా అధికారులు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్)**

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా (224) ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన వివిధ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఇందులో కొన్ని దరఖాస్తులు ఇలా ఉన్నాయి. పాలకుర్తి మండలం, విస్నూర్ గ్రామానికి చెందిన బి. వసంత, గత 12 సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా పొలాస గ్రామంలో జీవనం సాగిస్తున్నారని, గుంట పావు భూమి కూడా ఇక్కడే కలదని, అయితే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు కోసం జనగామ జిల్లా పరిధిలో దరఖాస్తు చేసినారని, కావున తన ప్రజాపాలన దరఖాస్తును జనగామ జిల్లా నుంచి జగిత్యాల జిల్లా పొలాస రూరల్ కు బదిలీ చేయాలని విన్నవిస్తూ



ఇందిరమ్మ ఇల్లు కొరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను అని, తెల్ల ఆహార భద్రత కార్డు కలదని, కావున తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, నివాసం కల్పించగలరని వేడుకుంటూ దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీ, 12వ వార్డుకు చెందిన పెంట సోమలక్ష్మి, గత ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారని, తమకు ఎటువంటి ఇల్లు, ఖాళీ స్థలం లేదని, డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పించుట కోసం ఆర్జీ ద్వారా కోరారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ కు చెందిన గౌరోజు దరఖాస్తు చేసియున్నారు. తరిగొప్పుల మండలం, ఎన్యా నాయక్ తండాకు చెందిన ఎం. నిర్మల, తనకు గల ఒక గుంట భూమి పట్టా పాస్ బుక్ లాక్ అయిందని, ఆర్డీఓ లాగిన్ లో ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. లింగాల ఘనపురం మండలం, వడ్డిచర్ల గ్రామానికి చెందిన రమాదేవి, తనకు సొంత ఇల్లు, సొంత స్థలం ఏమీ లేదు అని, అద్దెకు ఉంటున్నాను అని, గతంలో సదాశివరావు, హైదరాబాదు రోడ్డులో గల ఏకశిల కళాశాల పక్కన తనకు ప్లాటు కలదని, ఆ ప్లాటు కెనాల్ కాలువలో పోయిందని, ఈ విషయమై తనకు నష్ట పరిహారం ఇప్పించుట గురించి వినతిపత్రం సమర్పించనైనది. ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఆర్డీఓ వసంత, డీఏఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూములు త్యాగం చేసిన రైతులను విస్మరించిన యంత్రాంగం

## ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కు మాజీ జెడ్పిటిసి దుర్గ వినతి

**మణుగూరు, మార్చి 16 (తీన్మార్ న్యూస్):"**

భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరుగుతుందని, బీటీపీఎస్ యంత్రాంగం అన్నదాతల గ్రామాలలో ప్రజలకు మౌలిక ఏర్పాట్లలో ప్రభుత్వం, తోపాటు,ప్లాంట్ యాజమాన్యం విఫలం ఘోరంగా వైఫల్యం చెందిందని, మణుగూరు మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందనకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం దుర్గా మాట్లాడుతూ, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ స్థాపన సమయంలో భూములు కోల్పో యిన ప్రభావిత గ్రామాల్లోని భూ నిర్వాసి తులకు అలాగే, చిక్కుడుగుంట గ్రామ ప్రజలు తమ భూములు, ఇళ్లు, ఆలయాలు, జీవనాధారాలు త్యాగం చేశారని, కానీ ఇప్పటికీ ప్రభుత్వం మరియు ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు నేటి వరకు అమలు కాక నీటిమట్టలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు తాగునీటి కొరతను తొలగించేందుకు బీటీపీఎస్ యాజమాన్యం



ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులు ప్రజలకు ఉప యోగపడకుండా నిర్వీర్యమైపోయన్నారు. గోదావరి నది నుండి వచ్చే కలుషిత నీరు తాగి ప్రభావిత గ్రామాల ప్రజలు అనా రోగ్యా నికి గురవుతున్నారని, ప్రజలకు ఉపయోగించాల్సిన సి ఎస్ ఆర్ నిధులు పక్క జిల్లాలకు తరలిపోతున్నాయని ఆరోపించారు. ఓ వైపు ప్లాంట్ నుండి వెలువడే ఫ్లై యాష్, దుమ్ము, ఉద్గారాల వల్ల గ్రామస్తులు శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులతో పాటు, పంటల నష్టం వంటి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు మణుగూరు నుండి ఎటూరు నాగారం రహదారి, గ్రామ అంతర్గత రహ దారులు దారుణంగా ఉన్నాయన్నారు. రోజువారీ ప్రయాణం ప్రాణహానికరంగా మారిందని.మౌలిక వసతుల లోపంతో కనీసం వీధి దీపాలు కూడా వెలగని పరిస్థితి నెలకొందన్నారు. గ్రామాలలో అప్రశుద్ధ వాతావరణంతో చెత్త, దోమల సమస్యలు ప్రజల కంటినిండా నిద్రపోని పరిస్థితి ఉందని ఇదేనా పాలకుల ఇచ్చిన అభివృద్ధి అని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్లాంట్ యాజమాన్యం స్పందించి గ్రామ స్తుల సమస్యలను పరిష్కరించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి లాంటి యాజమాన్యం అందించే సి ఎస్ ఆర్ నిధులను నిర్వాసితుల గ్రామాలకు వినియోగించాలని, దుర్గా డిమాండ్ చేశారు.

## మృతుల కుటుంబాన్ని పరామర్శించి సర్పంచ్ జాడి రాంబాబు

**కన్నాయిగూడెం, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

మంత్రి సీతక్క ఆదేశాల మేరకు డీసీపీ అధ్యక్షులు పైడకుల అశోక్ మరియు యువనేత కుంజా సూర్యల సూచనల మేరకు కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ పార్టీ పిలుపు మేరకు ఇటీవల గత వారం రోజుల క్రితం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన దుర్గం (అసరెల్లి ) మున్నక్క (50) అనారోగ్యంతో మరణించగా వారి పెద్దకర్మ ఉండగా వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు అలాగే బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో కోత్తురు గ్రామానికి చెందిన చిన్న బక్కయ్య (80) అనారోగ్యంతో మరణించగా ఈరోజు వారిది కూడా పెద్ద కర్మ ఉండగా వారికి 50 కేజీల బియ్యం అందజేశారు అలాగే ఇరు మృతుల కుటుంబానికి ధైర్యం



చెప్పి వారి కుటుంబాలకు కాంగ్రేస్ పార్టీ అండగా ఉంటుంది అని వారి కుటుంబాలకు భరోసా ఇచ్చిన స్థానిక సర్పంచ్ జాడి రాంబాబు మరియు కన్నాయిగూడెం మండల కిసాన్ కాంగ్రేస్ అధ్యక్షులు తాటి రాజబాబు మరియు కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ నాయకులు.

ఈ కార్యక్రమంలో బుట్టాయిగూడెం వార్డు సభ్యులు సునార్కని ఆనంద రావు, జాడి సమ్మయ్య, గందర్ల సమ్మయ్య, బుట్టాయిగూడెం కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల కాంగ్రేస్ నాయకులు, వివిధ హోదాల కాంగ్రేస్ నాయకులు, యూత్ కాంగ్రేస్ మండల గ్రామ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## ఉద్యాన పంటల సాగు ద్వారా దీర్ఘకాలిక లాభాలు

**జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్**



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

రైతులు ఉద్యాన పంటల సాగు ద్వారా దీర్ఘకాలిక లాభాలతో పాటు మంచి ఆర్థిక ఆదాయం పొందే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో చిట్యాల మండలం, గుంటూరుపల్లి గ్రామంలో రైతులకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యాన పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ భూమిలోనే ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. మార్కెట్‌లో మంచి ధర లభించడం తో పాటు నీటి వినియోగం తక్కువగా ఉండటం వలన రైతుల ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. పండ్ల తోటలు మరియు కూరగాయల పంటలు రైతులకు నిరంతర ఆదాయాన్ని అందిస్తాయని చెప్పారు. ఉద్యాన పంటల సాగులో చేపట్టాల్సిన వివిధ యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల గురించి కూడా రైతులకు క్లుప్తంగా వివరించారు. ముఖ్యంగా సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకం, ఆయిల్ పామ్ పథకం, ఉద్యాన మిషన్ వంటి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి యూరియా యాప్ వినియోగంపై రైతులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డ్రిప్ కంపెనీ ప్రతినిధులు కుమార్ మరియు పరీక్షిత్ డ్రిప్ సాగు విధానం, దాని వినియోగం మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి రామాచారి, ఆయిల్ పామ్ ప్రతినిధులు సాయి, ప్రీతం, గవాస్కర్, పరిపూర్ కంపెనీ ప్రతినిధి పూర్ణచందర్, కుమార్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి సమ్మయ్య, రైతులు కొంక హనుమంతరావు, పువ్వాటి సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందుటకు అర్మ్డ్ రిజర్వ్ పోలీసుల ప్రీ ప్రమోషనల్ శిక్షణ ముగింపు



**మామూనూరు, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

4వ బెటాలియన్ లో నేడు పదోన్నతి పొందుటకు అర్మ్డ్ రిజర్వ్ పోలీసుల ప్రీ ప్రమోషనల్ శిక్షణ ముగింపు కార్యక్రమంకు అసిస్టెంట్ కమాండెంట్ ఇ.వీరన్న ముఖ్య అతిథిగా హాజరైనారు. తెలంగాణ అర్మ్డ్ పోలీస్ విభాగానికి చెందిన అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్ సబ్ ఇన్స్పెక్టర్స్ గా పదోన్నతి పొందుటకు 52 మంది అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్ కి 4వారాలపాటు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణలో భాగంగా అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్ కి ఎక్స్ట్రీమిసం డిజాస్టర్ మేనేజ్మెంట్, విఐపి సెక్యూరిటీ, గార్డ్స్ అండ్ ఎస్కార్ట్స్ (టిఎస్పిఎం), క్రిమినల్ మేజర్ యాక్ట్స్ (బిఎన్ఎస్,బిఎన్ఎస్ఎస్ & బిఎస్ఎ), లీడర్షిప్, మేనేజ్మెంట్ అంశాలపై నిష్ణాతులైన శిక్షకులచే శిక్షణను ఇచ్చామని అసిస్టెంట్ కమాండెంట్ ఇ.వీరన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు కార్తిక్, రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, క్రిష్ణ మరియు శిక్షణార్థులు, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

## రామాలయ అభివృద్ధికి సర్పంచ్ కృషి

**అతి త్వరలోనే దేవాలయానికి నిధులు మంజూరు చేస్తాం**



**బయ్యారం, మార్చి 16 (తీన్మార్ న్యూస్):**

బయ్యారం మండలం గంధంపల్లి-- కొత్తపేట గ్రామంలో శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ రామాలయ దేవాలయ అభివృద్ధి కోసం గ్రామ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. అందులో భాగమే ఈరోజు దేవాదాయ ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ మరియు ఇన్స్పెక్టర్‌ను సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ప్రత్యక్షంగా కలసి ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సిఫారసులేటర్ ను వారికి అందించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఆలయాన్ని ఎండోమెంట్ శాఖ పరిధిలోకి తీసుకుని 43 రిజర్వేషన్ చేయించి, ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని అధికారులను కోరారు. ఈ అంశంపై స్పందించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ మరియు ఇన్స్పెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వం ద్వారా అవసరమైన నిధులను త్వరలోనే మంజూరు చేయించి ఆలయ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలకు ఎంతోకాలంగా ఉన్న ఆకాంక్షను నెరవేరుతుందని అతి త్వరలోనే గంధంపల్లి-- కొత్తపేట గ్రామ రామాలయం మరింత వైభవంగా రూపుదిద్దుకుని ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామంలోని పురాతన రామాలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు అన్ని వసతులు కల్పించాలనే సంకల్పంతో సర్పంచ్ చేస్తున్న కృషిని గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## బొందల గడ్డను కబ్జా కాకుండా కాపాడండి

**కులం పేరుతో దూషించిన వారిపై చట్టరిత్య తీసుకోవాలి**

**కలెక్టరేట్‌లో నాయిబ్రాహ్మణుల పిర్యాదు**



సిద్దిపేట జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):

సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొక్కొండ గ్రామంలో నాయిబ్రాహ్మణుల బొందల గడ్డను కబ్జా చేస్తూ కులం పేరుతో దూషించిన దోమకొండ (కుమ్మరి) బాలేష్ మరియు కబ్జాదారునికి వత్తాసు పలుకుతూ నాయిబ్రాహ్మణ కులాన్ని కులస్థులను నోటికి చెప్పరాని బూతు పదాలతో తిడుతూ మంగళొళ్ళు బొచ్చు కూడ పీకలేరని బెదిరించిన సర్పంచ్ ఆశెల్లి విజయలక్ష్మి భర్త వాసు గౌడ్ పైన వాసుగౌడ్‌తో వచ్చి తిట్టిన మురాడి బాబు, తలారి మల్లేశ్ ల పైన కూడ చట్టరిత్య చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్వాల్ యాదనరేందర్ అన్నారు. ఈరోజు జిల్లా అధ్యక్షుడు కొత్వాల్ యాదనరేందర్ ఆధ్వర్యంలో ములుగు మండలం కొక్కొండ మరియు కొత్తూర్ గ్రామాల నాయిబ్రాహ్మణ కులస్థులు వారి సమస్య గురించి జిల్లా కలెక్టరేట్లో పిర్యాదు చేసారు. కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేసినవారిలో జంపాల మల్లేశ్, జంపాల రవి, ఆంజనేయులు, నరేష్, నవీన్, క్రాంతికుమార్, వినోద తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందాలి

**పదవ తరగతి విద్యార్థులకు మాథ్స్ భోధించిన కలెక్టర్**



జనగామ జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):

సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నర్మేట్టలోని పీహెచ్సి, కేజీబీవీ ని ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీహెచ్సి పరిసరాలను ముందుగా పరిశీలించి పలు సూచనలిచ్చారు. మందుల నిల్వ లను అలాగే వాటి మీద ఉన్న ఎక్స్పైరీ డేట్ ని పరిశీలించారు. వైద్యానికి సరిపడా మందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సరిపడ మందులను, వ్యాక్సిన్ లను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. అనంతరం కెజిబివిని సందర్శించి చుట్టూ పరిసరాలలో పెరిగే పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. నాణ్యముగా ఉన్నాయా లేదా అని వంటకు సరకులను, పప్పు దినుసులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన తయారీని కూడా క్షుణ్ణంగా చూసి జాగ్రత్తగా చేయాలనీ ఎప్పటికప్పుడు వంట చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలని, మెనూ ను తప్పకుండ పాటించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న 10వ తరగతి విద్యార్థులకు మాథ్స్ సబ్జెక్ట్ లోని పలు అంశాలను కలెక్టర్ స్వయంగా నేర్పించి వాటి మీద విద్యార్థులకు ఉన్న సామర్థ్యన్ని కూడా కలెక్టర్ పరిశీంచారు

## తోఫా కిట్లను పంపిణీ చేసిన కాంగ్రేస్ పార్టీ నాయకులు



మంగపేట, మార్చి 16 (తీన్మార్ న్యూస్)

మార్చి 16వ తారీకు అనగా సోమవారం రోజున రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోకన్న సూచనల మేరకు, ఈ నెల 21వ తేదీన మైనారిటీ సోదరి సోదరిమనుల అతిపెద్ద పండగ రంజాన్ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి పెద్దలు అనుముల రేవంతన్న ప్రత్యేక చొరవతో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఇస్తున్న తోఫా కిట్లను సుమారుగా 130 మంది కీ కిట్ల ను మండల కేంద్రం లోని మసీద్ (దర్గా ) వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గం, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**జిల్లా అడ్మినిస్ట్రేషన్ ట్రెజరరీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

**ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి - కలెక్టర్**



హనుమకొండ జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఖజానా శాఖ కార్యాల ప్రాంగణంలో సోమవారం జిల్లా ఖజానా శాఖ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదానశిభిరం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చాహత్ బాజ్ పాయ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందచేయడం జరిగినది. అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఈ గొప్ప సేవా కార్యక్రమమైన రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన జిల్లా పరిపాలనకు అభినందనలు తెలిపారు. రక్తదానం అనేది మనం మానవత్వానికి అందించగల అత్యున్నత సేవలలో ఒకటి. ఒక యూనిట్ రక్తం అనేక అమూల్యమైన ప్రాణాలను కాపాడగలదు. ప్రత్యేకంగా వేసవి కాలంలో రక్త బ్యాంకుల్లో రక్తం కొరత ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో అనేక మంది రోగులు నిరంతరం రక్తంపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా థలసీమియా మరియు సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఆరోగ్యంగా జీవించడానికి తరచూ రక్త మార్పిడి అవసరం అవుతుంది. వారికి రక్తం అనేది కేవలం అవసరం మాత్రమే కాదు,అది నిజంగా వారి ప్రాణాధారం. ఈ సందర్భంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం మరియు అవసరమైన వారికి సమయానికి రక్తం అందేలా చూడడంలో ఎంతో ముఖ్యమైన మరియు ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోంది. రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవ నిజంగా మానవతా సేవగా నిలుస్తోంది. అందువల్ల యువత, సేవా సంస్థలు మరియు ఎన్‌జీవోలు ముఖ్యంగా వేసవి కాలంలో నియమితంగా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని నేను హృదయపూర్వకంగా కోరుతున్నాను. సమాజంలో మంచి మార్పు తీసుకురాగల శక్తి, ఉత్సాహం మరియు దయ యువతలో ఉన్నాయి. రక్తదానం పూర్తిగా సురక్షితమైనది, సులభమైనది. మనం ఎవరో ఒకరి ప్రాణాన్ని కాపాడుతున్నామనే ఆనందం అపారమైన తృప్తిని ఇస్తుంది. కాబట్టి మనమంతా కలిసి రక్తదానంపై అవగాహన పెంచుతూ, ఎక్కువ మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా ప్రోత్సహిద్దాం. ఈ రక్తదాన శిబిరం లోహనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు: పుల్లూరు వేణుగోపాల్, బిళ్ళ రమణారెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి అకవారం శ్రీనివాస్ కుమార్, టి. ఎన్. జి. ఓ. ప్రెసిడెంట్ : ఆకుల రాజేందర్, టి. జి. ఓ. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు, ఉద్యోగ సంఘ నేతలు బైరి సోమయ్య, డా. ప్రవీణ్, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, కోలా రాజేష్ కుమార్, మాధవ రెడ్డి, లక్ష్మి ప్రసాద్, విజయలక్ష్మి, కిరణ్, శ్యామ్ సుందర్, ఫణికల రాజేష్, యం. ఆర్. ఓ లు బావు సింగ్, జగన్ మోహన్ రెడ్డి, ఖజానా శాఖ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, అన్వర్, చంద్ర శేఖర్, దయాకర్, ప్రసాద్, ఉదయ్ భాస్కర్ మరియు ఉద్యోగ సంఘాలు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం శిబిరం దిగ్విజయం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించిన జిల్లా కలెక్టర్

వరంగల్ జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 136 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 60, జీడబ్ల్యూఎంసీకి సంబంధించినవి 15, ఇతర శాఖలకు సంబంధించినవి 61 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖలో పెండింగ్ దరఖాస్తులు అధికంగా ఉన్న నేపథ్యంలో సంబంధిత మండలాల తహసీల్దార్లు కార్యక్రమానికి హాజరుకావడంతో కొంత మేరకు సమస్యల పరిష్కారానికి అవకాశం కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అదేవిధంగా వృద్ధుల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమ మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సఖి సెంటర్ కోఆర్డినేటర్ శ్రీలతకు పంపించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డిఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, హౌసింగ్ పీడీ శ్రీవాణి, డీడబ్ల్యూవో రాజమణి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 16 (తీన్మార్ న్యూస్):



ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్ లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దబజార్ ప్రాంతంలో నివాసం ఉంటున్న సాంబ పూర్ణచంద్రరావు (తండ్రి: వెంకటేశ్వర్లు) తమకు కొత్తగూడెం పట్టణ పరిధిలోని గాజులరాజా బస్తీ, విశ్వనాథ కాలనీ, హౌస్ నం.169/ఊ వద్ద 0.22 కుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి గృహ నిర్మాణం చేపడుతున్నారని, కావున తగిన చర్యలు తీసుకొని తమ భూమిని తిరిగి తమకు అప్పగించాలంటూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన ప్రజలు తమ కాలనీ సుమారు 35 సంవత్సరాల క్రితం ఏర్పడినప్పటి నుండి సీసీ రోడ్డు నిర్మాణం కోసం అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం జరగలేదని తెలిపారు. 2019లో రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పినప్పటికీ డ్రైనేజీ మరియు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని పేర్కొంటూ వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని చేసిన దరఖాస్తును తగు చర్యల నిమిత్తం లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన అశోక్ తమ గ్రామంలో సుమారు 10 సంవత్సరాల క్రితం మిషన్ భగీరథ ట్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు సక్రమంగా నీటి సరఫరా జరగలేదని తెలిపారు. గ్రామంలో ఉన్న రెండు బోర్లు కూడా ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొంటూ వేసవి కాలంలో త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించడంతో పాటు బోర్లను మరమ్మతు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మిషన్ భగీరథ అధికారులకు ఎండార్స్ చేశారు. మణుగూరు మండలం విట్టల్‌రావు నగర్‌కు చెందిన రావుల రాములు (తండ్రి: లేటు నారాయణ) తమకు తిర్లాపురం గ్రామం సర్వే నం.16/23/ఊలో ఐదు ఎకరాల భూమి ఉందని తెలిపారు. తమ తండ్రి మరణానంతరం కుటుంబ సభ్యులు ఆ భూమిని తమ పేర్లతో సర్వే చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ వివాదంలో ఉన్న భూమిపై సర్వే ప్రక్రియతో పాటు భూమి పరిహారం చెల్లింపులు తాత్కాలికంగా నిలిపివేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూసేకరణ అధికారులకు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ఉకంటి రవికుమార్ (తండ్రి: వెంకట్రావు) గత రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో పాలకవర్గాలు లేని సమయంలో నిర్వహించిన ఖర్చులు మరియు అప్పుల వివరాలను గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో ప్రజలకు తెలియజేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా పంచాయతీ అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాన్ని పరామర్శించి సర్పంచ్ జాడి రాంబాబు



కన్నాయిగూడెం, మార్చి 16 (తీన్మార్ న్యూస్):

మంత్రి సీతక్క ఆదేశాల మేరకు డీసీపీ అధ్యక్షులు పైడకుల అశోక్ మరియు యువనేత కుంజా సూర్యల సూచనల మేరకు కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ పార్టీ పిలుపు మేరకు ఇటీవల గత వారం రోజుల క్రితం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన దుర్గం (అసరెల్లి ) మున్నక్క (50) అనారోగ్యంతో మరణించగా వారి పెద్దకర్మ ఉండగా వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు అలాగే బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో కోత్తురు గ్రామానికి చెందిన చిన్న బక్కయ్య (80) అనారోగ్యంతో మరణించగా ఈరోజు వారిది కూడా పెద్ద కర్మ ఉండగా వారికీ 50 కేజీల బియ్యం అందజేశారు అలాగే ఇరు మృతుల కుటుంబానికి దైర్యం చెప్పి వారి కుటుంబాలకు కాంగ్రేస్ పార్టీ అండగా ఉంటుంది అని వారి కుటుంబాలకు భరోసా ఇచ్చిన స్థానిక సర్పంచ్ జాడి రాంబాబు మరియు కన్నాయిగూడెం మండ మండల కిసాన్ కాంగ్రేస్ అధ్యక్షులు తాటి రాజబాబు మరియు కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ నాయకులు. ఈ కార్యక్రమంలో బుట్టాయిగూడెం వార్డు సభ్యులు సునార్కని ఆనంద రావు, జాడి సమ్మయ్య, గందర్ల సమ్మయ్య, బుట్టాయిగూడెం కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల కాంగ్రేస్ నాయకులు, వివిధ హోదాల కాంగ్రేస్ నాయకులు, యూత్ కాంగ్రేస్ మండల గ్రామ నాయకులు, మహిళలు పాల్గొన్నారు




# “విశ్వనాథ్ - సన్స్” టీజర్ రిలీజ్

## షూటర్ జీవితంతో ప్రేమకథ కలిపి వెంకీ అట్లూరి కొత్త ప్రయోగం


సౌత్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం “విశ్వనాథ్ ఉ సన్స్” పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతిభావంతుడైన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నాగవంశీ నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ సినిమాను సమర్పిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, అది సోషల్ మీడియాలో మంచి స్పందనను అందుకుంటోంది. టీజర్‌ను పరిశీలిస్తే ఇది సాధారణ కమర్షియల్ సినిమా కాకుండా భావోద్వేగాలతో నిండిన స్పోర్ట్స్ డ్రామాగా ఉండబోతుందని అర్థమవుతోంది. ముఖ్యంగా ఓ షూటర్ స్పోర్ట్స్ పర్సన్ జీవితాన్ని, అతని కష్టాలు, విజయాలు, వ్యక్తిగత జీవితం చుట్టూ కథ నడుస్తున్నట్టు టీజర్‌లో చూపించారు. ఇందులో హీరో పాత్రకు గాఢమైన భావోద్వేగాలు, జీవితంలో ఎదురైన పోరాటాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో సూర్యకు జంటగా యువ నటి అమిత బైజు నటిస్తోంది. టీజర్‌లో వీరి మధ్య ఉండే ప్రేమకథ కూడా కథలో కీలక పాత్ర పోషించనున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హీరో 40 ఏళ్ల వయసులో ఎదుర్కొనే ప్రేమకథను దర్శకుడు చాలా హృద్యంగా చూపించబోతున్నట్టు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ అంశం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. టీజర్‌లో విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. షూటింగ్ రేంజ్‌లో జరిగే సన్నివేశాలు, స్పోర్ట్స్ నేపథ్యంతో రూపొందించిన సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. వెంకీ అట్లూరి గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాలో కూడా భావోద్వేగాలను ప్రధానంగా చూపించబోతున్నట్టు టీజర్ స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. మేకర్స్ ఇప్పటికే ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. స్పోర్ట్స్, ప్రేమ, భావోద్వేగాల మేళవింపుగా తెరకెక్కుతున్న “విశ్వనాథ్ ఉ సన్స్” సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందా అనేది చూడాలి. టీజర్ మాత్రం సినిమాపై మంచి అంచనాలను క్రియేట్ చేసింది.

# త్వరలోనే రిలీజ్

హీరో కిరణ్ అబ్బవరం కేఏ ప్రొడక్షన్స్, సుమైర స్టూడియోస్ నిర్మిస్తున్న”తిమ్మరాజుపల్లి టీవీ” మూవీ నుంచి ‘ఊరు సాంగ్’ రిలీజ్

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా “తిమ్మరాజుపల్లి టీవీ”. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. “తిమ్మరాజుపల్లి టీవీ” చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు “తిమ్మరాజుపల్లి టీవీ” సినిమా నుంచి ‘ఊరు సాంగ్’ రిలీజ్ చేశారు. వంశీకాంత్ రేఖన బ్యూటిఫుల్ గా కంపోజ్ చేసిన ఈ పాటకు సనరే సాహిత్యాన్ని అందించారు. మమత రమేష్ పాడారు. ‘ఊరు సాంగ్’ ఎలా ఉందో చూస్తే – ‘కొమ్మ కొమ్మల్లో కోయిల కూయంగ, తెల్లవారే మా పల్లె పచ్చపచ్చంగ, ఎచ్చని ఎలుగు సీరే కట్టె సక్కంగ, ముగ్గుల పూలు పెట్టి మెరిసే అందంగ, గడపల తోరణాలే గంతులు వేసెనుగా, పువులా పరిమళాలే గాలులు వీచెనుగా, ముస్తాభవుతున్నాదీ శివరాతిరి పండక్కి ఊరు, చిన్నా పెద్దల్లోన మొదలయ్యేను జాతర జోరు..’అంటూ ఆహ్లాదకరమైన పల్లెటూరిలో జరిగే శివరాత్రి జాతర సందడిని, ఆ పండక్కి ఊరు ప్రజలంతా సన్నద్ధమయ్యే తీరును వర్ణిస్తూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.





# ఉగాది కానుక ఉస్తాద్ భగత్ సింగ్’

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’ పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతుండగా, తాజాగా నిర్వహించిన గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది.ఇదిలా ఉండగా, విదేశీ మార్కెట్‌లో ముఖ్యంగా యూఎస్‌లో ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ మంచి స్పందనను అందుకుంటున్నాయి. ఇటీవలే ఈ చిత్రం 2 లక్షల డాలర్ల మార్క్‌ను దాటినట్లు సమాచారం. తాజాగా మరో మైలురాయిని అందుకుంటూ 10 వేలకుపైగా టికెట్లు విక్రయించబడినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. యూఎస్ మార్కెట్‌లో ఈ స్థాయి బుకింగ్స్ రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోంది. ప్రస్తుతం కూడా బుకింగ్స్ స్థిరంగా కొనసాగుతున్నాయి. రిలీజ్‌కు ఇంకా కొన్ని రోజులు ఉండటంతో, వచ్చే రోజుల్లో బుకింగ్స్ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు పవన్ కళ్యాణ్ స్టైల్ యాక్షన్, హరీష్ శంకర్ మార్క్ కమర్షియల్ టచ్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. ఇక సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రమోషనల్ కంటెంట్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించింది. ఉగాది సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా యూఎస్ మార్కెట్‌లో వస్తున్న అడ్వాన్స్ బుకింగ్స్ ఈ సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఇప్పుడు రిలీజ్‌కు ముందు రోజుల్లో ఈ బుకింగ్స్ ఎంతవరకు పెరుగుతాయో చూడాలి.

# ఫస్ట్ డే షూట్‌లో పవన్ కళ్యాణ్ నన్ను అడిగిన ప్రశ్న అదే

## ఉస్తాద్ భగత్ సింగ్ బ్యూటీ రాశీఖన్నా



టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కళ్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాశీఖన్నా కీ రోల్ పోషిస్తోంది. ఉస్తాద్ భగత్ సింగ్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా రాశీఖన్నా మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. పవన్ కళ్యాణ్ సినిమా అని తెలియగానే చాలా ఎక్జయిట్‌మెంట్‌తో కథ వినకముందే సినిమాకు ఒకే చెప్పానంది రాశీఖన్నా. నా తొలి సినిమా నుంచి పవన్ కళ్యాణ్ స్టార్‌డమ్ గురించి, పవనిజం గురించి చాలా వింటున్నా. అప్పటి నుంచి ఆయనతో ఒక్కసారైనా నటించాలని అనుకునేదాన్ని. ఉస్తాద్ భగత్ సింగ్‌తో నా కల నెరవేరింది. ఇందులో నేను శ్లోక అనే మోడ్రన్ యువతి పాత్రలో కనిపిస్తా. నాతోపాటు ప్రతీ పాత్ర కథలో చాలా ప్రాధాన్యత ఉంటుంది.ఇందులో నేను మాస్ సాంగ్‌లో కనిపిస్తా. ఆ పాటకు డ్యాన్స్ చేయడాన్ని, షూటింగ్‌ను చాలా బాగా ఎంజాయ్ చేశానంటూ చెప్పుకొచ్చింది. పవన్ కళ్యాణ్ సాదాసీదాగా ఉండే వ్యక్తి. ఎప్పుడూ బుక్స్ చదువుతుంటారు. ఆయన తొలి రోజు షూటింగ్‌లో మీరు నటి అవ్వాలనుకున్నారా..? అని నన్ను అడిగారు. నిజానికి తాను ఐఏఎస్ ఆఫీసర్ అవుదామనుకున్నానని ఆయనతో చెప్పాను. పవన్ కళ్యాణ్ తక్కువగా మాట్లాడుతారు.. కానీ ఆయన ప్రతీ మాటకు ఒక విలువ ఉంటుంది. ఆయన ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తుంటారంది రాశీఖన్నా. హరీష్ శంకర్‌కు మాస్ ఆడియెన్స్ పల్స్ చాలా బాగా తెలుసు. నిద్ర లేకుండా అవిశ్రాంతంగా సినిమా కోసం పనిచేశారు. 120 రోజుల్లో చేయాల్సిన షూటింగ్‌ను 40 రోజుల్లోనే పూర్తి చేశారు. సెట్స్‌లో తరచూ పంచ్ డైలాగ్స్ రాసేవారు. ఆయన నుంచి చాలా నేర్చుకున్నానని చెప్పింది రాశీఖన్నా. ఇప్పుడీ కామెంట్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ మూవీలో పార్థీబన్ విలన్‌గా నటిస్తుండగా.. గౌతమి, కేఎస్ రవికుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463